మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 17-10-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 108 Issue: 108

17 అక్టోబర్ 2025 - శుక్రవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు ఆశ్వయుజ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:13 సూర్యాస్తమయం - సా. 5:49 తిథిః ఏకాదశి ఉ. 11:14 వరకు తరువాత ద్వాదశి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం మఖ మ. 1:56 వరకు తరువాత పూర్వ ఫల్గుని(పుబ్బ) యోగం శుక్ల రా. 1:410 వరకు కరణం భాలవ ఉ. 11:14 వరకు కౌలవ రా. 11:44 వరకు వర్జ్యం రా. 10:32 నుండి రా. 12:15 వరకు దుర్ముహూర్తం ఉ. 8:32 నుండి ఉ. 9:19 వరకు మ. 12:24 నుండి మ. 1:10 వరకు రాహుకాలం ఉ. 10:34 నుండి మ. 12:01 వరకు యమగండం మ. 2:55 నుండి సా. 4:22 వరకు గుళికకాలం ఉ. 7:40 నుండి ఉ. 9:07 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:37 నుండి తె. 5:25 వరకు అమృత ఘడియలు ఉ. 11:25 నుండి మ. 1:06 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:38 నుండి మ. 12:24 వరకు గమనిక: "౦" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com

# ఓట్ల చోరీ.. ఇప్పుడేం చేయలేం!


## ఓట్ల అక్రమాల పిటిషన్‌పై హైకోర్టు కీలక ఉత్తర్వులు

**ఓటరు జాబితాలో అక్రమాలు జరిగాయని బీఆర్ఎస్ పిటిషన్**

**పిటిషన్‌ను పరిశీలిస్తున్నట్లు ఈసీ చెప్పిందన్న హైకోర్టు**

**ప్రత్యేకంగా ఆదేశాలు ఇవ్వలేమన్న ధర్మాసనం**

హైదరాబాద్, అక్టోబర్ 16 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయంటూ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు ఈరోజు విచారణ ముగించింది. ఈ పిటిషన్‌ను చట్ట ప్రకారం పరిశీలిస్తున్నామని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసిందని, ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా కోర్టు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని హైకోర్టు సీజే ధర్మాసనం ఉత్తర్వుల్లో తరువాయి 2 వ పేజీలో...



# రిజర్వేషన్లు పెంచలేం!

**సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి చుక్కెదురు**

**స్థానిక ఎన్నికల రిజర్వేషన్లపై పిటిషన్ కొట్టివేత**

**50 శాతం పరిమితి దాటవద్దని పేర్కొన్న ధర్మాసనం**

**పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలుండాలని సూచన**

హైదరాబాద్, అక్టోబర్ 16 (ఈవార్తలు): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను పెంచాలన్న తెలంగాణ ప్రభుత్వ ప్రయత్నాలకు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రిజర్వేషన్లు 50 శాతం పరిమితికి లోబడే ఉండాలని స్పష్టం చేసిన సర్వోన్నత న్యాయస్థానం, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను కొట్టివేసింది. అవసరమైతే పాత రిజర్వేషన్ల విధానంతోనే ఎన్నికలు నిర్వహించుకోవచ్చని ప్రభుత్వానికి సూచించింది. వివరాల్లోకి వెళితే, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ 9పై హైకోర్టు గతంలో స్టే విధించింది. ఈ స్టేను సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును తరువాయి 2 వ పేజీలో...

# రేవంత్ కాళ్లు పట్టుకోవాలా?



**మా అమ్మను ఇష్టమొచ్చినట్లు తిట్టాడు**

**భూముల కబ్జాల్లో రేవంత్ తమ్ముళ్లు**

**కొండా సుష్మిత సంచలన ఆరోపణలు**

**కేబినెట్ భేటీకి హాజరుకాని సురేఖ**

సీఎం రేవంత్ రెడ్డిపై మంత్రి కొండా సురేఖ కూతురు సుష్మిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. మమ్మల్ని వదిలేయండి అని రేవంత్ రెడ్డి కాళ్లు పట్టుకొని మొక్కాలా..? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి మా అమ్మను ఇష్టమొచ్చినట్లు తిట్టేవాడు. ఢిల్లీలో ఖర్గేతో మీటింగ్‌లో మా అమ్మను రేవంత్ రెడ్డి తిడితే ఆరోజు మా అమ్మ ఎంతో ఏడ్చింది అని సుష్మిత తెలిపారు.

హైదరాబాద్, అక్టోబర్ 16 (ఈవార్తలు): రేవంత్ రెడ్డి తమ్ముళ్లు తెలంగాణలో మొత్తం భూములు కబ్జా చేస్తున్నారు. మంచిరేవులలో విల్లాలు కట్టుకున్న కొందరు వ్యక్తులు దారి కోసం ఎండోమెంట్ భూమిని అడిగారు.. అది ఇస్తే పక్కన ప్రైవేట్ ల్యాండ్ ఇస్తామని అన్నారు. ఈ ఫైల్ మీద కొండా సురేఖ సంతకం చేస్తే, జపాన్‌లో ఉన్న రేవంత్ రెడ్డి ఆ ఫైల్‌ను ఆపించాడు. ఎందుకంటే రేవంత్ రెడ్డి తమ్ముళ్లు ఆ భూములను కబ్జా చేయాలని చూస్తున్నారు.. అందుకే మా అమ్మ సంతకం పెట్టిన ఫైల్‌ను రేవంత్ రెడ్డి ఆపేశాడని సుష్మిత పేర్కొన్నారు. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె సుష్మిత చర్చించారు. గత కొన్ని రోజులుగా తనకు సంబంధించి చోటు చేసుకుంటున్న పరిణామాలను వివరించారు. బుధవారం రాత్రి తన ఇంటి వద్దకు పోలీసులు వచ్చిన సమయంలో చోటు చేసుకున్న డ్రామాను వారికి వివరించారు. ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో భేటీ అనంతరం కొండా సురేఖ మీడియాతో మాట్లాడారు. 'నా సమస్య పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. సెటిల్ చేస్తామని పార్టీ పెద్దలు చెప్పారు. మిగిలిన తరువాయి 2 వ పేజీలో...

# ఎందరు పిల్లలున్నా... పోటీ

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లలు నిబంధనపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇద్దరు పిల్లల నిబంధన తొలగించాలని మంత్రి వర్గం నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాయలంలో మంత్రివర్గ సమావేశం జరిగింది. సమావేశం వివరాలను మంత్రి శ్రీనివాస్ రెడ్డి మీడియాకు వివరించారు. ఈ వానాకాలంలో 1.48 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుంది. దేశంలోనే ఇది రికార్డు స్థాయి ఉత్పత్తి. ఇందులో రాష్ట్రంలో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని పౌరసరఫరాల విభాగం అంచనా వేసింది. కేంద్ర ప్రభుత్వం 50 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణకు అంగీకరించింది.. మరో 15 లక్షల మెట్రిక్ టన్నులుసేకరించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని మంత్రి వర్గం నిర్ణయించింది. వానకాలం సీజన్లో పండించిన ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది.

## స్థానికంలో ఇద్దరు పిల్లల రూల్ ఎత్తివేత

**మెట్రో సెకండ్ ఫేజ్‌పై కమిటీ ఏర్పాటు... ధాన్యం కొనుగోళ్లపై కీలక నిర్ణయం**

**హ్యామ్ మోడ్‌లో 5,566 కి.మీ. రోడ్ల నిర్మాణం.. తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు**



హైదరాబాద్, అక్టోబర్ 16 (ఈవార్తలు): వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ, పౌర సరఫరాల శాఖ, రవాణా శాఖ సమన్వయంతో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించింది. ధాన్యానికి చెల్లించే మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు ఇచ్చే రూ.500 బోనస్ రైతుల ఖాతాల్లో వెంట వెంటనే జమ చేయాలని నిర్ణయం తీసుకుంది. కలెక్టర్లు, అదనపుకలెక్టర్లు కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలని.. ప్రతి కొనుగోలు కేంద్రం పర్యవేక్షణ, సమన్వయానికి ఒక్కో అధికారికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించాలని మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్రంలో కొత్తగా మూడు (3) అగ్రికల్చర్ కాలేజీల ఏర్పాటు కు రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. హుజూర్ నగర్, కొడంగల్, నిజామాబాద్‌లో అగ్రికల్చర్ కాలేజీల ఏర్పాటుకు ఆమోదం తరువాయి 2 వ పేజీలో...




# దీపావళికి ముందే 'కిసాన్' డబ్బులు

న్యూఢిల్లీ: రైతులకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పనుంది. రైతులకు ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద 21వ విడత డబ్బులను వారి అకౌంట్లలో వేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే కొన్ని ప్రకృతి విపత్తు ఎదుర్కొన్న రాష్ట్రాల్లో పీఎం కిసాన్ డబ్బులను రైతుల అకౌంట్లలో వేశారు. ఈ దీపావళి నాటికి పీఎం కిసాన్ డబ్బులు దేశ వ్యాప్తంగా ఉన్న రైతుల అకౌంట్లలో జమ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పీఎం కిసాన్ యోజన అనేది వ్యవసాయం రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వ పథకం. రైతులకు ఆర్థిక సహాయం అందించడానికి ఈ తరువాయి 2 వ పేజీలో...




| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్): | రూ.12,944 |
| వెండి (గ్రాము): | రూ.206 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,685 |

## విశ్వవాణి



మగ కప్ప అంటే ఇష్టం లేకపోయినా, దానితో శృంగారం చేయడం ఇష్టం లేకపోయినా.. ఆడ కప్పలు చనిపోయినట్లుగా నటిస్తాయట. శ్వాసను బిగపట్టడం, కదలకుండా ఉండిపోవడం లాంటి పనులు చేసి మగ కప్ప నుంచి రక్షణ పొందుతాయట.



# మల్లన్న సేవలో మోదీ

**ప్రతి భారతీయుడి బాగు కోసం ప్రార్థించా**

**దేశ ప్రజల శ్రేయస్సు కోసం ప్రత్యేక పూజలు చేశా**

**ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి**

**ప్రధాని వెంట చంద్రబాబు, పవన్ కల్యాణ్**

**శ్రీ శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించిన ప్రధాని**

**రూ.13,430 కోట్ల పనులకు శంకుస్థాపన**

శ్రీశైలం, కర్నూలు, నంద్యాల అక్టోబర్ 16 (ఈవార్తలు): ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. దేశ ప్రజలంతా సుఖసంతోషాలతో, మంచి ఆరోగ్యంతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో -2 వ పేజీలో...



# జనంలోకి అన్నలు

**ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయిన 170 మంది.. వెల్లడించిన అమిత్ షా**

రాయ్‌పూర్: సుమారు 170 మంది మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్‌లో గురువారం లొంగిపోయారు. తమ వద్ద ఉన్న ఆయుధాలను వారు అప్పగించారు. జోనల్ ఇన్‌చార్జ్, మావోయిస్టు సైనిక విభాగం ఇంటెలిజెన్స్ చీఫ్ రూపేష్ కూడా లొంగిపోయిన వారిలో ఉన్నారు. మావోయిస్టులు -2 వ పేజీలో...

# వ్యూస్ అంటే ఊచలు లెక్కపెట్టిస్తాం!

**ఫేమస్ అయ్యేందుకు చిన్నారులతో అసభ్యకర కంటెంట్**

**తీవ్రంగా స్పందించిన హైదరాబాద్ సీపీ సజ్జనార్**




హైదరాబాద్, అక్టోబర్ 16 (ఈవార్తలు): వ్యూస్ వ్యామోహంలో విలువలు విస్మరిస్తే ఎలాగని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ప్రశ్నించారు. కేవలం వ్యూస్, లైక్స్ కోసం సామాజిక మాధ్యమాల్లో ప్రాచుర్యం పొందడానికి చిన్నారుల భవిష్యత్తును పణంగా పెట్టడం సముచితం కాదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని యూట్యూబ్ ఛానళ్లు పిల్లలతో నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలను ఉద్దేశించి ఆయన 'ఎక్స్' వేదికగా తన అభిప్రాయాన్ని వెల్లడించారు. చిన్నారులతో అసభ్యకరమైన కంటెంట్ సృష్టిస్తూ సమాజానికి ఎటువంటి సందేశాన్ని ఇస్తున్నారని ఆయన ప్రశ్నించారు. చిన్నారులు, తరువాయి 2 వ పేజీలో...

# మెటాఫండ్ సూత్రధారి అరెస్టు

**సుమారు రూ.60 కోట్ల దందా**

**క్రిప్టో కరెన్సీ, బిట్ కాయిన్ మోసం**

**బాధితుల్లో ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు**




కరీంనగర్, అక్టోబర్ 16 (ఈవార్తలు): క్రిప్టోకరెన్సీ, బిట్ కాయిన్ పేరిట జరుగుతున్న మోసాల వెనుక ఉన్న సూత్రదారులు, పాత్రదారులు ఒక్కొక్కరుగా పోలీసుల చేతికి చిక్కుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుమారు 60 కోట్ల రూపాయల దందాకు పాల్పడిన దుండగులను ఇప్పటికే కొందరిని అదుపులోకి తీసుకున్నారు. తాజాగా, ఈ వ్యవహారం -2 వ పేజీలో...

# వయాగ్రాలతో భర్తను చంపాలని..!

**ఒకేసారి భోజనంలో 15 గోలీలు**

**వాసన రావడంతో తినని భర్త**

**మళ్లీ మద్యంలో బీపీ, నిద్రమాత్రలు**

**అపస్మారక స్థితిలోకి వెళ్లాక హత్య**

**కరీంనగర్‌లో కేసులో సంచలనాలు**




కరీంనగర్, అక్టోబర్ 16 (ఈవార్తలు): వయాగ్రాలతో భర్తను చంపాలని చూసిందో భార్య. వీలుకాకపోవడంతో, మద్యంలో బీపీ, నిద్రమాత్రలు కలిపి ఇచ్చి.. అపస్మారకస్థితిలోకి వెళ్లాక ఉరేసి చంపింది. వివరాల్లోకెళితే.. కత్తి సురేశ్ హత్యకేసును కరీంనగర్ పోలీసులు చేధించారు. తాగుడుకు బానిసై వేధింపులకు పాల్పడుతున్న కత్తి సురేశ్‌ను (36) భార్య మౌనిక మద్యంలో నిద్రమాత్రలు -2 వ పేజీలో...

# రాశి ఫలాలు

17.10.2025

మేషం: ఉద్యోగయత్నాలు మందకొడిగా సాగుతాయి. చేపట్టిన పనులలో శ్రమాధిక్యత కలుగుతుంది. కుటుంబ సభ్యుల నుండి ఒత్తిడులు పెరుగుతాయి. ఆలయ దర్శనాలు చేసుకుంటారు. వ్యాపార, ఉద్యోగాలలో కొన్ని సమస్యలు తప్పవు. ముఖ్యమైన వ్యవహారాల్లో తొందరపాటు నిర్ణయాలు చేయడం మంచిది కాదు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి.

వృషభం: చేపట్టిన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి. వ్యాపారాలలో ఒడిదుడుకులు అధికమవుతాయి. సన్నిహితుల నుంచి కీలక సమాచారం అందుతుంది. నూతన రుణాలు చేస్తారు. కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలు నిలకడగా ఉండవు. ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది.

మిధునం: వ్యయప్రయాసలతో కాని పనులు పూర్తి కావు. దూరపు బంధువుల నుండి ఆసక్తికర సమాచారం సేకరిస్తారు. బంధువులతో వివాదాలు చికాకు పరుస్తాయి. వ్యాపార, ఉద్యోగాలలో బాధ్యతలు పెరుగుతాయి. కొన్ని వ్యవహారాలలో ఆకస్మికంగా నిర్ణయాలు మార్చుకుంటారు. ఆర్థిక పరిస్థితి అంతగా అనుకూలించదు.

కర్కాటకం: ఆరోగ్య ఈ విషయంలో జాగ్రత్త అవసరం. చేపట్టిన పనులలో శ్రమ అంతగా ఫలించదు. బంధువులతో వివాదాలు తప్పవు. మిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో చికాకులు పెరుగుతాయి. పాత రుణాలు తీర్చడానికి నూతన ప్రయత్నాలు చేస్తారు. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది.

సింహం: సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. దూరపు బంధువుల కలయిక ఆనందం కలిగిస్తుంది. స్థిరస్తి కొనుగోలు చేస్తారు. వ్యాపారాలు లాభాల బాట పడతాయి. ఉద్యోగాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. విందువినోదాది ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి అవుతాయి.

కన్య: వ్యాపార, ఉద్యోగాలలో సమస్యాత్మక వాతావరణం ఉంటుంది. కుటుంబ సభ్యులతో వివాదాలు పరిష్కారం అవుతాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన పనులు మందగిస్తాయి. దూరపు బంధువులను కలుసుకుంటారు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. దైవదర్శనాలు చేసుకుంటారు.

తుల: ఆప్తుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఇంటా బయట ఆశ్చర్యకరమైన సంఘటనలు చోటుచేసుకుంటాయి. మొండి బాకీలు వసూలవుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో ప్రోత్సాహకర వాతావరణం ఉంటుంది. సన్నిహితులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాదిస్తారు.

వృశ్చికం: రాజకీయ ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. దీర్ఘకాలిక వివాదాలు పరిష్కారవుతాయి. ఆకస్మిక ధన లాభ సూచనలు ఉన్నవి. వ్యాపార, ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రులతో పాత జ్ఞాపకాలను పంచుకుంటారు.

ధనస్సు: దైవచింతన పెరుగుతుంది. ఖర్చుల విషయంలో పునరాలోచన చేయడం మంచిది. ముఖ్యమైన పనుల్లో ఊహించని ఆటంకాలు కలుగుతాయి. వ్యాపార ఉద్యోగాలు అంతంత మాత్రంగా సాగుతాయి. నూతన ఋణప్రయత్నాలు చేస్తారు. ఆత్మీయులతో చిన్నపాటి వివాదాలతో తప్పవు.

మకరం: వ్యాపార వ్యవహారాల్లో పెద్దలు సలహాలు తీసుకుని ముందుకు సాగడం మంచిది. ముఖ్యమైన వ్యవహారాలు నిదానంగా సాగుతాయి. కుటుంబ సభ్యులతో కొన్ని వివాదాలు చికాకు పరుస్తాయి. ఉద్యోగాలలో కొత్త సమస్యలు ఎదురవుతాయి. ఆర్థిక పరిస్థితి నిరాశ పరుస్తుంది. దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది.

కుంభం: నూతన వాహనయోగం ఉన్నది. విద్యార్థులు పోటీపరీక్షల్లో విజయం సాధిస్తారు. వృత్తి వ్యాపారాలలో ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. వ్యాపార ఉద్యోగాలలో నూతన ఆశలు చిగురిస్తాయి. సన్నిహితుల నుండి శుభవార్తలు అందుతాయి. ఆర్థిక లావాదేవీలు ప్రోత్సాహకరంగా సాగుతాయి.

మీనం: నూతన వాహన యోగం ఉన్నది. సమాజంలో పలుకుబడి కలిగిన వ్యక్తుల పరిచయం. స్థిరస్తి కొనుగోలుకు ఆటంకాలు తొలగుతాయి. వ్యాపార విస్తరణకు అవరోధాలు తొలగుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. మొండి బాకీలు వసూలవుతాయి.

# మల్లన్న సేవలో మోదీ



**మొదటి పేజీ తరువాయి**

కలిసి ప్రధాని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నంద్యాల జిల్లాలోని శ్రీశైలం క్షేత్రానికి చేరుకున్న ప్రధాని మోదీకి ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం ప్రధాని వివిధ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటిగా, అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటిగా విరాజిల్లుతున్న ఈ క్షేత్రం యొక్క విశిష్టతను, చారిత్రక ప్రాముఖ్యతను అర్చకులు ప్రధానికి వివరించారు. అనంతరం ప్రధాని తన పర్యటనకు సంబంధించిన ఫోటోలను 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నారు. ఈ పర్యటనతో శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న నాలుగో భారత ప్రధానిగా నరేంద్ర మోదీ నిలిచారు. గతంలో జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావు ఈ ఆలయాన్ని సందర్శించారు. ప్రధానిగా మోదీ శ్రీశైలానికి రావడం ఇదే తొలిసారి. ఆలయ దర్శనం తర్వాత ప్రధాని మోదీ శ్రీశైలంలో ఉన్న శ్రీ శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. 1677లో ఛత్రపతి శివాజీ మహారాజ్ ఈ క్షేత్రాన్ని సందర్శించిన దానికి గుర్తుగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అక్కడి ధ్యాన మందిరాన్ని, శివాజీ విగ్రహాన్ని ప్రధాని పరిశీలించారు. కేంద్రం నిర్వాహకులు దాని ప్రాముఖ్యతను మోదీకి వివరించారు. అంతకుముందు కర్నూలు విమానాశ్రయానికి చేరుకున్న ప్రధానికి గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ స్వాగతం పలికారు.

**రూ.13,340 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం**

ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి కార్యక్రమాలకు భారీ ఊతం లభించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రంలో ఏకంగా రూ.13,340 కోట్ల విలువైన పలు కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. కర్నూలు జిల్లా నన్నూరు వద్ద నిర్వహించిన 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' సభ వేదికగా ఆయన ఈ అభివృద్ధి పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, ప్రధాని మోదీ రూ.9,449 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేయగా, మరో రూ.1,704 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన రూ.2,276 కోట్ల విలువైన పనులను ఆయన జాతికి అంకితం చేశారు. కొత్తగా శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులలో రాయలసీమ అభివృద్ధికి కీలకమైన ఓర్వకల్లు, కొప్పర్తి ఇండస్ట్రియల్ కారిడార్‌లు ఉన్నాయి. వీటి నిర్మాణానికి రూ.4,920 కోట్లు కేటాయించారు. కర్నూలులో విద్యుత్ మౌలిక వసతుల బలోపేతానికి రూ.2,880 కోట్లతో ఏర్పాటు చేయనున్న విద్యుత్ ట్రాన్స్‌మిషన్ వ్యవస్థకు కూడా ప్రధాని పునాదిరాయి వేశారు. వీటితో పాటు, రూ.960 కోట్లతో సబ్బవరం-షీలానగర్ గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారికి, రూ.493 కోట్లతో కొత్తవలస-విజయనగరం మధ్య నాలుగో రైల్వే లైన్‌కు, రూ.184 కోట్లతో పెందుర్తి-సింహాచలం నార్త్ మధ్య రైల్వే ఫ్లైఓవర్ లైన్‌కు శంకుస్థాపన చేశారు. ప్రధాని మోదీ తన పర్యటనలో భాగంగా పలు పూర్తయిన ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. రూ.286 కోట్లతో నిర్మించిన కడప-నెల్లూరు-చునియంపల్లి రహదారులను, రూ.593 కోట్లతో పూర్తి చేసిన పీలేరు-కాలూరు సెక్షన్ నాలుగు లేన్ల రహదారిని ప్రారంభించారు. అంతేకాకుండా, రూ.546 కోట్ల విలువైన కొత్తవలస-కోరాపుట్ రైల్వే డబ్లింగ్ పనులను, రూ.1,730 కోట్లతో నిర్మించిన శ్రీకాకుళం-అంగుల్ సహజవాయువు పైప్‌లైన్‌ను ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక, రవాణా రంగాలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని అధికారులు తెలిపారు.

## ఓట్ల చోరీ.. ఇప్పుడేం చేయలేం!

**మొదటి పేజీ తరువాయి**

పేర్కొంది. పిటిషనర్ల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు వాదనలు వినిపించారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్నాయని, ఇలా 1942కు పైగా ఓట్లను గుర్తించినట్లు తెలిపారు. నియోజకవర్గానికి సంబంధం లేని 12 వేలకు పైగా ఓట్లను గుర్తించినట్లు చెప్పారు. అనుమానాస్పద ఓట్లు, బోగస్ ఓట్లు, ఒకరికి ఒకటి కంటే ఎక్కువ ఓట్ల వివరాలను ఈ నెల 13న ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకోలేదని అన్నారు. ఎన్నికల కమిషన్ తరఫున దేశాయ్ అవినాశ్ రెడ్డి వాదనలు వినిపించారు. ఓటర్ల జాబితా నిరంతర ప్రక్రియ అని, 365 రోజుల పాటు ఓటర్ల నమోదు, తొలగింపు, సవరణ జరుగుతూనే ఉంటుందని కోర్టుకు తెలిపారు. ఓటర్ల జాబితాను ఈ ఏడాది జులైలో ప్రచురించి అభ్యంతరాలు కోరామని, కానీ అప్పుడు ఎలాంటి అభ్యంతరాలు రాలేదని కోర్టుకు తెలియజేశారు. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత పిటిషనర్లు అత్యవసర పిటిషన్ దాఖలు చేశారని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ అభ్యంతరాలను పరిశీలిస్తున్న సమయంలో పిటిషన్ దాఖలు చేయడాన్ని తప్పుబట్టారు. కాబట్టి ఆ పిటిషన్ విచారణార్హం కాదని కోర్టుకు తెలియజేశారు. ఈ నెల 21వ తేదీ వరకు అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని కోర్టుకు తెలిపారు. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం పిటిషన్లపై విచారణ ముగించినట్లు తెలిపింది. పిటిషనర్ల ఫిర్యాదులను పరిశీలిస్తున్నట్లు ఈసీ తెలిపినందున ప్రత్యేక ఆదేశాలు అవసరం లేదని పేర్కొంది.ఖ

## రిజర్వేషన్లు పెంచలేం!

**మొదటి పేజీ తరువాయి**

ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. రాష్ట్రవ్యాప్తంగా కులగణన సర్వే నిర్వహించి, శాస్త్రీయంగానే రిజర్వేషన్లను పెంచాలని నిర్ణయించామని, దీనిపై అసెంబ్లీలో కూడా అన్ని పార్టీలు ఏకాభిప్రాయం వ్యక్తం చేశాయని కోర్టుకు వివరించారు. అయితే, రిజర్వేషన్లు 50 శాతం మించరాదని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన కృష్ణమూర్తి తీర్పు స్పష్టంగా చెబుతోందని ప్రతివాదుల తరఫు న్యాయవాది బలంగా వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, ఈ అంశంపై ఇప్పటికే హైకోర్టులో విచారణ కొనసాగుతున్నందున తాము జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. ఈ దశలో పిటిషన్‌ను విచారణకు స్వీకరించలేమని పేర్కొంటూ కొట్టివేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో సంబంధం లేకుండా ఈ కేసులో విచారణను కొనసాగించాలని హైకోర్టుకు సూచించింది.

## జనంలోకి అన్నలు

**మొదటి పేజీ తరువాయి**

ప్రమాదకరమైన ఉస్పారి ఘాట్ ద్వారా ఇంద్రావతి నదిని దాటి భైరామ్‌గఢ్ వైపు తరలివెళ్లారు. బీజాపూర్ చేరుకున్న తర్వాత జగదల్‌పూర్‌లో అధికారికంగా లొంగిపోయారు. కాగా, మావోయిస్టుల లొంగుబాటు కోసం భైరామ్‌గఢ్‌ను వర్చువల్ కోటగా భద్రతా దళాలు మార్చాయి. ఉస్పారి ఘాట్ నుంచి భైరామ్‌గఢ్ వరకు ఉన్న రహదారులను 24 గంటల పాటు పర్యవేక్షించారు. సీనియర్ అధికారులు కూడా బీజాపూర్‌కు చేరుకున్నారు. మరోవైపు కేంద్ర హోంమంత్రి అమిత్ షా మావోయిస్టు లొంగుబాటును ధృవీకరించారు. నక్సలిజంపై పోరాటంలో ఒక మైలురాయిగా అభివర్ణించారు. 'ఛత్తీస్‌గఢ్‌లో 170 మంది నక్సలైట్లు లొంగిపోయారు. బుధవారం 27 మంది తమ ఆయుధాలను విడిచిపెట్టారు. మహారాష్ట్రలో బుధవారం 61 మంది ప్రధాన స్రవంతిలోకి తిరిగి వచ్చారు. మొత్తం మీద, గత రెండు రోజుల్లో 258 మంది వామపక్ష తీవ్రవాదులు హింసను త్యజించారు' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

# రేవంత్ కాళ్లు పట్టుకోవాలా?

**మొదటి పేజీ తరువాయి**

విషయాలు వారే చూసుకుంటారని భరోసాతో వెళ్తున్నా' అని మంత్రి సురేఖ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తమ కుటుంబానికి ఎలాంటి విభేదాలు లేవని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళి స్పష్టం చేశారు. తమ నివాసంలో బుధవారం రాత్రి చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఆయన గురువారం వరంగల్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ వివాదాలను ఎవరో సృష్టిస్తున్నారని, దానికి తాను బాధ్యుడిని కాదని ఆయన అన్నారు. 'వరంగల్‌లో పార్టీ మీటింగ్ ఉండడంతో ఇక్కడికి వచ్చాను. ఇంట్లో ఏం జరిగిందో నాకు పూర్తిగా తెలియదు. సురేఖ కూడా సమావేశానికి వస్తున్నారు' అని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తనకు పూర్తి విశ్వాసం ఉందని మురళి పేర్కొన్నారు. 'దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి తర్వాత తెలంగాణకు అంతటి వ్యక్తి రేవంత్ రెడ్డి అని మేము భావించాం. ఆయనే సీఎం కావాలని కోరుకున్నాం. నాకు ఎమ్మెల్సీ పదవి ఇస్తానని కూడా ఆయన హామీ ఇచ్చారు' అని మురళి గుర్తుచేశారు. తాను ఇప్పటివరకు సెక్రటేరియట్‌కు ఒక్కసారి కూడా వెళ్లలేదని, భవిష్యత్తులో కూడా వెళ్లనని కొండా మురళి స్పష్టం చేశారు. కేవలం కొండా సురేఖ ఛాంబర్ వాస్తు చూడటానికి మాత్రమే ఒకసారి వెళ్లానని చెప్పారు. 'నాకు ఏమైనా అవసరం ఉంటే సీఎం రేవంత్ రెడ్డి లేదా ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇళ్లకే వెళ్తాను. వైఎస్ఆర్ ఉన్నప్పుడు మాత్రం ఆయన వెంట వెళ్లేవాడిని' అని అన్నారు. తన కుమార్తె సుస్మిత వ్యాఖ్యల గురించి అడగ్గా, 'నా బిడ్డ లండన్‌లో పెరిగింది. ఆమెకు ఏ పదవి లేదు, మాట్లాడే స్వేచ్ఛ ఉంది. ఆమె ఏం మాట్లాడిందో నాకు తెలియదు. నాకు ఫోన్ కూడా చూడటం రాదు' అని తెలిపారు.

**ఆర్‌అండ్‌బీకి మేడారం పనులు**

కాంగ్రెస్ పార్టీలో మేడారం జాతర పనుల చిచ్చు రగులుతూనే ఉన్నది. తన శాఖలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అతిగా జోక్యం చేసుకుంటున్నారని, మేడారం అభివృద్ధి పనులను ఆయన కంపెనీకి దక్కేలా చేసుకున్నాడని మంత్రి సురేఖ ఆరోపించిన విషయం తెలిసిందే. పొంగులేటిపై కొండా దంపతులు పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు కూడా చేశారు. అయితే మంత్రుల మధ్య వివాదాలకు కారణమంటూ కొండా సురేఖ ఓఎస్డీ సుమంత్‌ను ప్రభుత్వం ఉన్నఫలంగా తొలగించింది.

## ఎందరు పిల్లలున్నా...పోటీ

**మొదటి పేజీ తరువాయి**

తెలిపింది. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు పూర్తయిన సందర్భంగా ప్రజా పాలన -ప్రజా విజయోత్సవాలను నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. డిసెంబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తుంది. ఉత్సవాల నిర్వహణ.. సంబంధిత ఏర్పాట్లపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం. ఇద్దరు పిల్లలకు మించి సంతానమున్న వారు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులనే నిబంధనను మంత్రివర్గం పునరాలోచన చేసింది. రాష్ట్రంలో జనాభా నియంత్రణ కట్టుదిట్టంగా అమలవుతున్న తరుణంలో ఈ గరిష్ఠ నిబంధనను అమలు చేయాల్సిన అవసరం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అ య్యాయి. ఈ నిబంధనను ఎత్తివేసేందుకు కేబినెట్ సూచనప్రాయంగా అంగీకరించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడులో ఏన్కూర్ మార్కెట్ యార్డ్ కు పది ఎకరాలు కేటాయిస్తూ కేబినెట్ తీర్మానం చేసింది. నల్సార్ న్యాయ విశ్వ విద్యాలయానికి ఇప్పుడున్న చోటనే అదనంగా 7 ఎకరాల భూమిని కేటాయించే ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నల్సార్ యూనివర్సిటీ అడ్మిషన్లలో ఇప్పుడు తెలంగాణ స్థానికులకు కేటాయించిన 25 శాతం సీట్ల కోటాను 50 శాతం పెంచాలని కేబినెట్ తీర్మానం చేసింది. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.

మెట్రో 2%ూ, 2దీ% విస్తరణకు అడ్డంకిగా మారిన మొదటి దశను పీపీపీ మోడ్లో నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునే విషయంపై సుదీర్ఘంగా చర్చించింది. అధికారుల కమిటీ తమ రిపోర్టును కేబినేట్ సబ్ కమిటీకి అందిస్తుంది. కేబినేట్ సబ్ కమిటీ సిఫారసుల ఆధారంగా మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునే విషయంలో తుది నిర్ణయం తీసుకోవాలని మంత్రివర్గం తీర్మానించింది.

## లెక్కపెట్టిస్తాం!

**మొదటి పేజీ తరువాయి**

యువతకు స్ఫూర్తినిచ్చే, ఆదర్శంగా నిలిచే వ్యక్తులను ఇంటర్వ్యూ చేసి సమాజాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. పిల్లలతో ఇష్టానుసారంగా వీడియోలు చేసి వారిని తప్పుదోవ పట్టించవద్దని హితవు పలికారు. ఇటువంటి చర్యలు పోక్సో, జువైనల్ చట్టాల ఉల్లంఘన కిందకే వస్తాయని, ఇది పిల్లలను వేధించినట్టు అవుతుందని ఆయన అన్నారు. మైనర్లతో సహా ఈ తరహా కంటెంట్ సృష్టించి వారి పట్ల పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని ఆయన స్పష్టం చేశారు. బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలతో రూపొందించే అసభ్యకరమైన కంటెంట్‌ను వెంటనే తొలగించాలని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకూడదని ఆయన తేల్చి చెప్పారు. అలా జరగని పక్షంలో చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

### 'కిసాన్' డబ్బులు

**మొదటి పేజీ తరువాయి**

పథకం ప్రారంభించారు. గతంలో 20వ విడతను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆగస్టు 2, 2025న వారణాసి నుండి విడుదల చేశారు. ప్రతి ఏడాది రైతుల అకౌంట్లలో మొత్తం రూ.6000 మూడు విడతల్లో రైతుల అకౌంట్లలో వేస్తోంది. అయితే ఈ ఏడాది ఇప్పటికే రెండు విడతల్లో రూ.4000 రైతుల అకౌంట్లలో జమ కాగా, మరో రూ.2000 రైతుల అకౌంట్లలో వేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. పీఎం కిసాన్ యోజన పథకం దేశ వ్యాప్తంగా ఉన్న రైతులందరికీ అమలు అవుతోంది.

## మెటాఫండ్ సూత్రధారి అరెస్టు

**మొదటి పేజీ తరువాయి**

వెనుక ఉన్న ప్రధాన సూత్రదారి, కింగ్ పిన్ వరాల లోకేశ్వర్ రావును అరెస్టు చేసిన వివరాలను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం గురువారం మీడియాకు వెల్లడించారు. కరీంనగర్‌కు చెందిన తులసీ ప్రకాశ్‌తో 2024లో స్నేహం తర్వాత మెటాఫండ్, బిట్ కాయిన్ పేరిట మోసాలకు తెర తీసింది ఈ ముఠా. తులసీ ప్రకాశ్‌తో పాటు బూర శ్రీధర్, దాసరి రాజు, దాసరి రమేశ్, మాజీ కార్పొరేటర్ కట్ల సతీశ్‌తో జట్టు కట్టిన లోకేశ్వర్ రావు.. పెట్టుబడి పేరున దాదాపు రూ.60 కోట్ల మోసాలకు పాల్పడ్డారు. యూబిట్ తరహాలో మెటాఫండ్ పేరిట ఓ నకిలీ యాప్ సృష్టించారు. రూ.90 వేలకు వెయ్యి కాయిన్స్ ఇచ్చి నెలలో మూడింతల డబ్బు వస్తుందని నమ్మబలికి సామాన్యులను వలలో వేసుకున్నారు. హైదరాబాద్‌లోని ఓ రిసార్ట్ లో ఘనంగా మెటాఫండ్ యూబిట్ కాయిన్స్ లాంచింగ్ కార్యక్రమం చేశారు. ఈ కేటుగాళ్లు 450 మంది బాధితుల నుంచి రూ.25 కోట్ల నుంచి రూ.30 కోట్లు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్, టూ టౌన్ పీఎస్ లో కేసులు నమోదయ్యాయి. ఇప్పటికే దాసరి రాజు, దాసరి రమేశ్, కట్ల సతీశ్, బూర శ్రీధర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం లోకేశ్వర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు.. నిందితుడి నుంచి ఆస్తుల పత్రాలు, 30 తులాల బంగారం, మొబైల్ ఫోన్స్, ట్యాబ్స్, బీఎండబ్ల్యూ కారు స్వాధీనం చేసుకున్నారు.

## విద్య, ఉద్యోగవాణి

**ఎన్‌ఎస్‌యూటీలో ఉద్యోగాలు**

మొత్తం పోస్టులు: 176

అర్హత: బీఈ, బీటెక్, బీఎస్, ఎమ్ఈ, ఎంటెక్, ఎమ్ఎస్, పీహెచ్‌డీ

వయోపరిమితి: 35-50 మధ్య గలవారు

పరీక్ష విధానం: రాత పరీక్ష

ఎంపిక విధానం: ఇంటర్వ్యూ

ద్వారాదరఖాస్తు చివరి తేదీ: 11, నవంబర్ 2025 వరకు

వెబ్‌సైట్: https://nsut.ac.in/

# వయాగ్రాలతో భర్తను చంపాలని..!

**మొదటి పేజీ తరువాయి**

కలిపి చంపింది. అనంతరం కిటీకి చీరతో ఉరివేసి చంపేసినట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. ఈ హత్యకు పరోక్షంగా సహకరించిన మొత్తం ఐదుగురిని కూడా అరెస్టు చేసినట్లు వెల్లడించారు. సెప్టెంబరు 17న కరీంనగర్‌లో అనుమానాస్పద స్థితిలో కత్తి సురేశ్ మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు.. భార్యే హంతకురాలు అని గుర్తించారు. ఈ కేసులో మృతుడి భార్యతో పాటు ఆరుగురు నిందితులను కరీంనగర్ టుటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. కత్తి సురేశ్(36), మౌనిక (29) 2015లో ప్రేమవివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. సురేశ్ మద్యానికి బానిస కావడంతో ఇల్లు గడవడమే కష్టంగా మారింది. ఈక్రమంలోనే ఆమెకు దొమ్మాటి అజయ్ (28)తో వివాహేతర సంబంధం ఏర్పడింది. భర్త తరచూ డబ్బు కోసం వేధించడమే కాకుండా తన స్వేచ్ఛకు అడ్డు వస్తున్నాడనే నెపంతో సురేశ్‌ను హత్య చేయాలని మౌనిక కుట్ర చేసింది. తన సమీప బంధువు శ్రీజ (32)తో ఈ విషయంపై చర్చించింది. తనకు పరిచయస్తుడైన మెడికల్ ఏజెన్సీ యజమాని పోతు శివకృష్ణ (27)కు మౌనికను శ్రీజ పరిచయం చేసింది. వీరితో పాటు తన మిత్రురాలు వేముల రాధ అలియాస్ నల్ల సంధ్య (39), ఆమె భర్త నల్ల దేవదాస్ (49)లకు సైతం పరిచయం చేసింది. సురేశ్‌ను చంపేందుకు రకరకాల ఆలోచనల పంచుకున్నారు. ఒక రోజు సురేశ్‌కు భోజనంలో 15 వయాగ్రా మాత్రలను ఒకేసారి భోజనంలో కలిపి ఇవ్వడంతో భోజనం ఏదో వాసన వస్తోందని తినడానికి సురేశ్ నిరాకరించాడు. అయితే గత నెల 17న మెడికల్ ఏజెన్సీ యజమాని శివకృష్ణ సూచన మేరకు, టెల్మికిండ్-(హెచ్80) (బీపీ మందులు), ట్రైకా (నిద్ర మాత్రలు) మిశ్రమాన్ని మద్యంలో కలిపి ఇవ్వడంతో సురేశ్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఆ తర్వాత చీరను కిటికీ గ్రిల్‌కు కట్టి దాన్ని సురేశ్ మెడకు చుట్టి గట్టిగా లాగి ఊపిరాడకుండా చేసి చంపేసింది. అనంతరం ఆమె తన అత్తమామలకు ఫోన్ చేసి, లైంగిక చర్య సమయంలో భర్త స్పృహ కోల్పోయాడని నమ్మించే ప్రయత్నం చేసింది. ఘటన జరిగిన తీరుపై సురేశ్ కుటుంబ సభ్యులు, బంధువులు అనుమానం వ్యక్తం చేశారు. దీంతో సురేశ్ కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# భూముల అర్రస్ పాట!

## రాయదుర్గంలో మళ్లీ భూముల వేలం

**గజం రిజర్వ్ ధర 3,10,000**

**నాలెడ్జ్ సిటీలోని 4,718.22 చదరపు గజాల**

**నోటిఫికేషన్ జారీ చేసిన టీజీఐఐసీ**

హైదరాబాద్, అక్టోబర్ 16 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ భూముల వేలానికి మరోసారి సిద్ధమైంది. రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, రాయదుర్గం పరిధిలోని నాలెడ్జ్ సిటీలో 4,718.22 చదరపు గజాల ప్రభుత్వ స్థలాన్ని వేలం వేయడానికి టీజీఐఐసీ నోటిఫికేషన్ జారీ చేసింది. గజానికి రూ. 3,10,000 రిజర్వ్ ధరను నిర్ణయించినట్లు టీజీఐఐసీ పేర్కొంది. ఈ భూమికి సంబంధించిన ఈ-వేలం నవంబర్ 11న మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు టీజీఐఐసీ కార్యాలయంలో జరుగుతుందని తెలిపింది. ఇటీవల రాయదుర్గంలో టీజీఐఐసీ 18.67 ఎకరాలను వేలానికి పెట్టింది. తొలి విడతలో 7.67 ఎకరాలను వేలం వేయగా, ఎకరం భూమి రూ. 177 కోట్లు పలికింది. రాష్ట్రంలో ఇప్పటి వరకు జరిగిన భూముల వేలంలో ఇది అత్యధిక ధర. 7.67 ఎకరాల భూమిని రూ. 177 కోట్ల చొప్పున రూ. 1,356 కోట్లకు ఎంఎస్ఎం రియాల్టీ సంస్థ దక్కించుకుంది. ఈసారి గజానికి రూ. 3,10,000 అంటే ఎకరాకు రూ. 124 కోట్లుగా వస్తుంది.




# కేంద్ర పథకాల పేరుతో మోసం

**సైబర్ పోలీసుల హెచ్చరిక**

**వాట్సాప్ మెసేజ్‌లతో మోసపోవద్దని హెచ్చరిక**

హైదరాబాద్, అక్టోబర్ 16 (ఈవార్తలు): కేంద్ర ప్రభుత్వ పథకాల పేరుతో జరుగుతున్న సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ పోలీసులు హెచ్చరించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. వాట్సాప్ గ్రూపులలో వచ్చే సందేశాలను చూసి మోసపోవద్దని, అర్హత కోసం లింక్స్‌లపై క్లిక్ చేసి మీ వ్యక్తిగత వివరాలను నమోదు చేయవద్దని సూచించారు. ప్రభుత్వ పథకాల కోసం అధికారిక వెబ్‌సైట్లను మాత్రమే సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. వాట్సాప్ గ్రూపులలో సైబర్ నేరగాళ్లు ఫేక్ లింక్స్‌లను పంపి, కేంద్ర ప్రభుత్వ పథకాలు అందుబాటులో ఉన్నాయని నమ్మబలుకుతారని పేర్కొన్నారు. అర్హతను పరిశీలించుకోవాలని ఆశ చూపుతూ లింక్‌లను పంపుతారని, వాటిపై తొందరపడి క్లిక్ చేయవద్దని హెచ్చరించారు. అపరిచితులు పంపించే లింక్స్, సందేశాలకు స్పందించవద్దని సూచించారు.

# తెలంగాణ అడవుల్లో షూటింగ్‌లు

## 24 గంటల్లోనే అనుమతులు.. 70 లొకేషన్లను గుర్తించిన అధికారులు

**ఆన్‌లైన్‌లో దరఖాస్తు.. 24 గంటల్లోనే పర్మిషన్లు**

**'ఫిలిమ్స్ ఇన్ తెలంగాణ' పేరుతో సింగిల్ విండో**

**రోజుకు రూ.50 వేల ఫీజుతో చిత్రీకరణకు అవకాశం**

హైదరాబాద్, అక్టోబర్ 16 (ఈవార్తలు): తెలంగాణలో సినీ పరిశ్రమకు, పర్యాటక రంగానికి ఊతమిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై రాష్ట్రంలోని పలు అటవీ ప్రాంతాల్లో సినిమా షూటింగ్‌లకు అనుమతి ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకోసం సింగిల్ విండో విధానాన్ని ప్రవేశపెడుతూ, దరఖాస్తు చేసుకున్న కేవలం 24 గంటల్లోనే అనుమతులు మంజూరు చేసేలా చర్యలు చేపట్టింది. ఈ నిర్ణయం సినీ నిర్మాతలకు సమయం, ఖర్చు రెండింటినీ ఆదా చేయనుంది. ఈ నూతన విధానంలో భాగంగా 'ఫిలిమ్స్ ఇన్ తెలంగాణ' పేరుతో ప్రభుత్వం ఒక ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. షూటింగ్‌లకు అవసరమైన అన్ని అనుమతులను ఈ పోర్టల్ ద్వారానే పొందవచ్చు. అటవీ ప్రాంతాల్లో చిత్రీకరణ కోసం దరఖాస్తు చేసుకుంటే కేవలం 24 గంటల్లోనే అనుమతి లభిస్తుంది. ఒకవేళ ఏవైనా సాంకేతిక కారణాలతో ఆలస్యమైనా, ముందుగా నిర్ణయించుకున్న షెడ్యూల్ ప్రకారం షూటింగ్ జరుపుకోవడానికి వెసులుబాటు కల్పించడం విశేషం. అటవీ శాఖ అధికారులు సినీ పరిశ్రమ వర్గాలతో చర్చించి, షూటింగ్‌లకు అనువుగా ఉండే సుమారు 70 ప్రాంతాలను గుర్తించారు. వీటిలో వికారాబాద్, అమ్రాబాద్, నర్సాపూర్, వరంగల్, ఆదిలాబాద్‌లోని దట్టమైన అడవులతో పాటు హైదరాబాద్ శివార్లలోని 52 అర్బన్ ఫారెస్ట్ పార్కులు కూడా ఉన్నాయి. నారపల్లి నందనవనంలోని జింకల పార్కు, చిలుకూరు ఫారెస్ట్ ట్రెక్, కండ్లకోయ ఆక్సిజన్ పార్కు వంటివి ఈ జాబితాలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ లొకేషన్లలో చిత్రీకరణకు రోజుకు రూ.50 వేల రుసుమును ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు (ఎఫ్‌డీసీ) ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది. గతంలో 'ఆర్ఆర్ఆర్' వంటి భారీ చిత్రంలోని కొన్ని కీలక సన్నివేశాలను వికారాబాద్ అడవుల్లో చిత్రీకరించారు. ఇప్పుడు హైదరాబాద్‌కు 60 నుంచి 100 కిలోమీటర్ల పరిధిలోనే అనేక సుందరమైన లొకేషన్లు అందుబాటులోకి రావడంతో చిత్ర పరిశ్రమకు ఇది ఎంతో ప్రయోజనకరంగా మారింది. ఈ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి చార్మినార్ సీసీఎఫ్ ప్రియాంక వర్గీస్‌ను నోడల్ ఆఫీసర్‌గా ప్రభుత్వం నియమించింది.




# హరీశ్‌రావు ప్రత్యేక చొరవ

**రాష్ట్రానికి 12 మంది గల్ఫ్ కార్మికులు**

హైదరాబాద్, అక్టోబర్ 16 (ఈవార్తలు): మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు చొరవతో.. జోర్డాన్‌లో చిక్కుకున్న 12 మంది గల్ఫ్ కార్మికులు వారం రోజుల్లో తెలంగాణకు చేరుకోనున్నారు. "బతుకుబండిని నడిపేందుకు, కుటుంబాలను పోషించేందుకు జోర్డాన్ వెళ్లాం. కానీ ఇప్పుడు స్వదేశానికి తిరిగి వచ్చే మార్గమే కనిపించట్లేదు సార్.. మమ్మల్ని కాపాడండి" అని పంపిన ఒక్క వాట్సప్ మెసేజ్ వారికి దారి చూపింది. బీఆర్ఎస్ పార్టీ రూపంలో తెలంగాణకు చేరుకునేందుకు బాటలు వేసింది. తెలంగాణ గల్ఫ్ కార్మికుల గోడును విన్న మాజీ మంత్రి హరీశ్ రావు, కేసీఆర్ ఆదేశాలతో 12 మందిని ఎలాగైనా రప్పించాలని నిశ్చయించుకున్నారు. వారి స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని తన కార్యాలయానికి సూచించారు. 12 మందికి స్వయంగా తానే ఫోన్ చేసి 'ధైర్యంగా ఉండండి ఎట్లయినా మిమ్మల్ని తెలంగాణకు తీసుకువస్తాం' అని భరోసా ఇచ్చారు. ఒకవైపు జోర్డాన్ గల్ఫ్ కార్మికుల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సహా మీడియా దృష్టికి తీసుకువెళ్లిన హరీశ్ రావు, మరోవైపు బీఆర్ఎస్ ఎంపీ సురేశ్ రెడ్డి ద్వారా భారత విదేశీ వ్యవహారాల శాఖ అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. ఇంకోవైపు సంబంధిత కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ క్రమంలో పెనాల్టీ చెల్లించి వారిని తెలంగాణకు తీసుకువెళ్లవచ్చు అని కంపెనీ చెప్పగా దానికి అంగీకరించారు. గల్ఫ్ కార్మికుల ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా చెల్లించాల్సిన మొత్తంతో పాటు, స్వదేశానికి రావడానికి అయ్యే విమాన టికెట్లను సైతం స్వయంగా హరీశ్ రావు భరించారు. దీంతో విమాన టికెట్ల బుకింగ్ ప్రక్రియ సైతం పూర్తయింది. మరో వారంలో నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి, జగిత్యాల, సిద్దిపేటలకు చెందిన 12 మంది గల్ఫ్ కార్మికులు తెలంగాణ గడ్డపై అడుగు పెట్టబోతున్నారు. సుదీర్ఘ కాలపు ఎదురుచూపుల తర్వాత వారి కుటుంబాలను కలుసుకోబోతున్నారు. ప్రభుత్వంలో ఉన్న పెద్దలు చేయలేని పని, ప్రతిపక్షంలో ఉన్న హరీశ్ రావు గారు చేసి, ప్రజలకు సేవ చేసేందుకు అధికారంతో సంబంధం లేదని నిరూపించారు. 12 మంది కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారు. త్వరలో స్వదేశానికి రాబోతున్నాం, కుటుంబ సభ్యులను కలుసుకోబోతున్నామని జోర్డాన్‌లో ఉన్న గల్ఫ్ కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తుండగా, మరోవైపు తమ వారు సొంతూళ్లకు రాబోతున్నారని వారి కుటుంబ సభ్యులు సంతోషపడుతున్నారు. ఇందుకు ఎంతగానో కృషి చేసిన హరీశ్ రావుకు ధన్యవాదాలు చెబుతున్నారు.

# మంత్రులుగా మాఫియా డాన్లు

**ఆర్ఎస్పీ సంచలన వ్యాఖ్యలు**



హైదరాబాద్, అక్టోబర్ 16 (ఈవార్తలు): రాష్ట్రంలో మాఫియా డాన్‌లు మంత్రులు అయ్యారని బీఆర్ఎస్ సీనియర్ లీడర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో పాలన అస్తవ్యస్తంగా మారిందన్న ఆయన.. బుధవారం రాత్రి నుంచి హైదరాబాద్ నగరంలో హైడ్రామా నడుస్తోందని ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. మంత్రి నివాసం నుంచి నిందితుడిని టాస్క్ ఫోర్స్ పోలీసులు బయటకు తీసుకు రాలేక పోయారు. మాఫియా డాన్‌లు మంత్రులు అయ్యారు. ప్రజల జీవితాలతో వారు ఆడుకుంటున్నారు. రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరిగా మారింది. సామాన్యుడికో న్యాయం మంత్రులకు ఓ న్యాయమా? మా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏసీబీ ఆఫీస్ నుంచి తెలంగాణ భవన్ నడుచుకుంటూ వస్తే పోలీసులు కేసు పెట్టారు. మా బీఆర్ఎస్ నాయకుడు క్రిశాంక్ సోషల్ మీడియాలో పోస్టు పెడితే పది కేసులు పెట్టారు. మంత్రికి సంబంధించిన మనిషిపై కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదు అని ఆర్ఎస్పీ మండిపడ్డారు. సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న నల్ల బాలు, గౌతమ్ తదితరులను రోజుల తరబడి జైల్లో పెట్టారు. యూరియా కోసం అడిగిన గిరిజన రైతును మిర్యాలగూడలో రోకలి బండలు ఎక్కించారు. డెక్కన్ సిమెంట్ వారిని బెదిరించిన సీఎం సన్నిహితుడు రోహిన్ రెడ్డి, కొండా సురేఖ ఓఎస్డి సుమంత్‌పై ఎందుకు కేసులు నమోదు చేయలేదు? పోలీసులు కొండా సురేఖ నివాసం వద్ద ప్రేక్షకులుగా మారిపోవడం దారుణం. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రేవంత్ రెడ్డి కాల్ డేటా తీస్తే అన్ని నిజాలు బయట పడుతాయి. సచివాలయంలో ప్రభుత్వ పరంగా జరగాల్సిన వ్యవహారాలు ప్రైవేట్ గెస్ట్ హౌస్‌ల్లో జరుగుతున్నాయి. రోహిన్ రెడ్డి, సుమంత్ తుపాకులు పెట్టి ఎలా బెదిరిస్తారు? అసలు తుపాకులు వారి దగ్గరకు ఎలా వచ్చాయని అని ఆర్ఎస్పీ నిలదీశారు. 'కొండా సురేఖ కూతురు మాటల్లో ప్రభుత్వ పెద్దల చీకటి దందాలు బయట పడ్డాయి. మాఫియా డాన్‌ల చేతికి రాష్ట్రం వెళ్లిందా ? పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బెదిరింపులతో ఆత్మహత్యయత్నానికి ఒడిగట్టిన బానోతు రవి ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయాలేదు. కమిషన్ల కోసం మంత్రులు బాహాటంగా కొట్లాడుకుంటున్నారు. అడ్లూరి లక్ష్మణ్, వివేక్, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి.. ఒకరి మీద ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నార'ని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. తెలంగాణ భవన్ ముందట ఇంటెలిజెన్స్ పెట్టె బదులు రోహిణ్ రెడ్డి, ఫహీమ్ ఖురేషి, తిరుపతి రెడ్డి గెస్ట్ హౌస్‌ల దగ్గర నిఘా పెట్టొచ్చు కదా..? రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఒక్క భూ యాజమాని సుఖంగా లేడు. ఆర్ఆర్ టాక్స్ భాదితులు ఎక్కువయ్యారు. గురుకులాల్లో మరణ మృదంగం కొనసాగుతున్నా ఈ ప్రభుత్వానికి పట్టింపు లేదు. 108 మంది విద్యార్థులు చనిపోయారు. మధ్యాహ్న భోజన సిబ్బందికి, మిషన్ భగీరథ సిబ్బందికి జీతాలు లేవు. కొన్ని చోట్ల ఉపాధ్యాయులు, హెడ్ మాస్టర్లు పిల్లలకు భోజనం వండి పెడుతున్నారు. సీఎం అనుచరులు ఒక్కో ఏరియాను పంచుకుని వసూళ్లు సెటిల్ మెంట్లు చేస్తున్నారు. పోలీసులు ఏం చేస్తున్నారు? వారిని ప్రేక్షకులుగా మార్చారు. గ్యాంగ్‌ల పాలన ఎక్కువైంది. గ్యాంగ్‌లకు మంత్రులు నాయకులుగా మారారు. రాష్ట్రంలో గన్ కల్చర్, మాఫియా పాలన పోవాలంటే రేవంత్ ప్రభుత్వాన్ని గవర్నర్ బర్తరఫ్ చేయాలి. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ గెలవకపోతే మాఫియా పాలన పెరిగిపోతుంది. ఈ రోజు కేబినెట్ సమావేశంలో మంత్రులు మూకుమ్మడిగా రాజీనామా చేసి తమకు పాలన చేతకావడం లేదని తప్పుకోవాలి. మాఫియా కేబినెట్ సంస్కృతి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నుంచే మొదలైంది అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.

# జీహెచ్ఎంసీలో భూగర్భంలో విద్యుత్తు లైన్లు!

**ఓవర్‌హెడ్ విద్యుత్ తీగల తొలగింపునకు ప్రణాళిక**

**బెంగళూరు మాదిరిగా భూగర్భ కేబుల్స్ ఏర్పాటుకు నిర్ణయం**

**25,000 కిలోమీటర్ల లైన్ల మార్పునకు ప్రతిపాదనలు సిద్ధం**



హైదరాబాద్, అక్టోబర్ 16 (ఈవార్తలు): గ్రేటర్ హైదరాబాద్ వాసులకు త్వరలో వేలాడే విద్యుత్ తీగల సమస్య తీరనుంది. నగరమంతటా సురక్షితమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా కోసం భూగర్భ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) ఒక భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. బెంగళూరు నగరంలో విజయవంతంగా అమలు చేస్తున్న ఈ విధానాన్ని స్ఫూర్తిగా తీసుకుని, హైదరాబాద్‌లోనూ దీనిని అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ ప్రాజెక్టు కింద గ్రేటర్ పరిధిలోని సుమారు 25,000 కిలోమీటర్ల పొడవైన ఓవర్‌హెడ్ విద్యుత్ లైన్లను దశలవారీగా భూగర్భంలోకి మార్చనున్నారు. ఇందులో 21,643 కిలోమీటర్ల 11 కేవీ లైన్లు, 3,725 కిలోమీటర్ల 33 కేవీ లైన్లు ఉన్నాయి. ఈ బృహత్కార్యానికి దాదాపు రూ. 14,000 కోట్ల నుంచి రూ. 15,000 కోట్ల వరకు ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు డిస్కం అధికారులు ఇప్పటికే మూడు జోన్లకు సంబంధించిన వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలను (డీపీఆర్) సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించారు. ఈ పనులను వేగంగా, ప్రజలకు ఇబ్బంది లేకుండా పూర్తి చేయడానికి 'హారిజాంటల్ డ్రిల్లింగ్' అనే సరికొత్త టెక్నాలజీని ఉపయోగించాలని డిస్కం భావిస్తోంది. ఈ విధానంలో రోడ్లను పెద్దగా తవ్వాల్సిన అవసరం లేకుండానే, ప్రత్యేక యంత్రాలతో భూమిలో 2-3 మీటర్ల లోతులో కేబుళ్లను వేయవచ్చు. తద్వారా పనులు వేగంగా పూర్తవడంతో పాటు ఖర్చు కూడా తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. భూగర్భ కేబుళ్లు వేయడం కష్టంగా ఉన్న ప్రాంతాల్లో 'ఎయిర్ బంచుడ్' (ఏబీ) కేబుళ్లను ప్రత్యామ్నాయంగా పరిశీలిస్తున్నారు. ఈ ప్రాజెక్టు అమలుకు ముందు డిస్కం ఉన్నతాధికారులు, ఇంజనీర్లు బెంగళూరు, ముంబై, కోల్‌కతా వంటి నగరాల్లో పర్యటించి అక్కడి భూగర్భ కేబుల్ వ్యవస్థను అధ్యయనం చేశారు. బెంగళూరులో మాదిరిగా, భూగర్భంలో కేబుళ్ల కోసం ఏర్పాటు చేసే డక్టులను భవిష్యత్తులో టెలికాం సంస్థలకు లీజుకు ఇవ్వడం ద్వారా ఆదాయం సంపాదించే ఆలోచనను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్' (ఆర్డీఎస్ఎస్) కింద నిధులు పొందే అవకాశాలను కూడా డిస్కం అన్వేషిస్తోంది.

# మధ్యాహ్న భోజనంలో కప్ప

**మహబూబ్ నగర్ జిల్లా స్కూలులో కలకలం**

**అప్పటికే అన్నం తినేసిన కొందరు విద్యార్థులు**

**టీచర్లపై మండిపడ్డ విద్యార్థుల తల్లిదండ్రులు**

మహబూబ్‌నగర్, అక్టోబర్ 16 (ఈవార్తలు): మహబూబ్ నగర్ జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. పాఠశాలలోని విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనంలో కప్ప కనిపించడంతో విద్యార్థులు నివ్వెరపోయారు. అప్పటికే కొంతమంది విద్యార్థులు భోజనం చేయడంతో వారి తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. విద్యార్థులు, తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని సీసీకుంట మండలం లాల్‌కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సుమారు 270 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. ఓ విద్యార్థికి పప్పు వడ్డిస్తుండగా అందులో నుంచి చనిపోయిన కప్ప బయటపడింది. దీంతో భోజనం చేయకుండా ఇంటికి వెళ్లిన విద్యార్థులు తమ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అప్పటికే కొందరు విద్యార్థులు భోజనం చేయడంతో వారి ఆరోగ్యంపై ఆందోళన నెలకొంది. అయితే, ఈ విషయం బయటకు పొక్కకుండా పాఠశాల హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు జాగ్రత్త పడ్డారని సమాచారం. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు మధ్యాహ్న భోజనం నిర్వాహకులు, ఉపాధ్యాయులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, లాల్‌కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో కప్ప వచ్చినట్లు ఫిర్యాదు అందిన మాట వాస్తవమేనని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ ధృవీకరించారు. దీనిపై పూర్తి విచారణ చేపడతామని ఆయన తెలిపారు.

# తల్లి శవం ముందే నగల కోసం పంచాయితీ

**చనిపోయి 3 రోజులైనా అంత్యక్రియలు చేయని వైనం**

**సూర్యాపేట జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో ఘటన**

ఆత్మకూరు, అక్టోబర్ 16 (ఈవార్తలు): కన్నతల్లి మృతదేహం ముందే కూతుళ్లు నగల కోసం పోట్లాడుకున్న ఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూరు మండలంలో చోటుచేసుకుంది. తల్లి దాచిన డబ్బు, నగల కోసం చివరకు మృతదేహానికి అంత్యక్రియలు చేయకుండా ఆపడం విస్మయం కలిగిస్తోంది. మూడు రోజులుగా మృతదేహాన్ని నట్టింట్లో పెట్టుకుని మరీ నగల లెక్కల కోసం కూతుళ్లు పట్టుబట్టడంపై చుట్టుపక్కల వారు తీవ్రంగా విమర్శిస్తున్నారు. అయినా సరే డబ్బు, నగల వాటా తేలాకే అంత్యక్రియలు చేస్తామని ఆ కూతుళ్లు స్పష్టం చేయడం గమనార్హం. రక్తసంబంధాలకే మచ్చలా మారిన ఈ విషాదకర ఘటన వివరాలు.. ఆత్మకూరు ఎస్ మండల కేంద్రానికి చెందిన పొదిలి నరసమ్మ అనే వృద్ధురాలు మూడు రోజుల కింద మరణించింది. విషయం తెలిసి పుట్టింటికి వచ్చిన నరసమ్మ ఇద్దరు కూతుళ్లు అంత్యక్రియలకు ఏర్పాట్లు చేయడం మాని తల్లి దాచిన డబ్బు, నగల కోసం వెతుకులాట మొదలుపెట్టారు.

# 2.37 కోట్ల బంగారం పట్టివేత

శంషాబాద్, అక్టోబర్ 16 (ఈవార్తలు): శంషాబాద్ విమానాశ్రయంలో భారీగా బంగారం పట్టుబడింది. కువైట్ నుంచి షార్జా మీదుగా హైదరాబాద్ చేరుకున్న ఒక ప్రయాణికుడిని డీఆర్ఐ అధికారులు తనిఖీ చేయగా, అతని వద్ద 7 బంగారు కడ్డీలు లభ్యమయ్యాయి. సుమారు 1.8 కిలోల బరువున్న ఈ బంగారు కడ్డీల విలువ సుమారు రూ. 2.37 కోట్లు ఉంటుందని డీఆర్ఐ అధికారులు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రయాణికుడి నుంచి స్వాధీనం చేసుకున్న వాటిలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన 5 బంగారు బిస్కట్లు, రెండు కట్ పీసులు ఉన్నాయి. అధికారులకు అనుమానం రాకుండా వాటిని లగేజీ డోర్ మెటాలిక్ లాక్‌లో కొంత భాగాన్ని, అలాగే పొద్దు తిరుగుడు గింజలు ఉన్న ప్లాస్టిక్ పౌచ్‌లో మరికొంత బంగారాన్ని దాచి తరలించే ప్రయత్నం చేశాడు.

# నవంబర్ 14న కోర్టుకు రావాల్సిందే

**దగ్గుబాటి హీరోలకు న్యాయస్థానం ఆదేశం**

నాంపల్లి/హైదరాబాద్, అక్టోబర్ 16 (ఈవార్తలు): ప్రముఖ సినీ నటులు దగ్గుబాటి వెంకటేశ్, రానాలతో పాటు నిర్మాత సురేశ్ బాబు, అభిరామ్‌లకు నాంపల్లి కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఫిల్మ్‌నగర్‌లోని ఓ హోటల్ కూల్చివేతకు సంబంధించిన కేసులో నలుగురూ 14న కోర్టు ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావాలని స్పష్టం చేసింది. ఆ రోజు కోర్టుకు వచ్చి పర్సనల్ బాండ్ సమర్పించాలని ఆదేశించింది. వివరాల్లోకి వెళితే, ఫిల్మ్‌నగర్‌లోని దక్కన్ కిచెన్ హోటల్‌ను కోర్టు ఆదేశాలను ధిక్కరించి కూల్చివేశారనే ఆరోపణలపై వెంకటేశ్, రానా, సురేశ్ బాబు, అభిరామ్‌లపై కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి గురువారం నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. ఈ విచారణ సందర్భంగా న్యాయస్థానం పై విధంగా ఆదేశాలు ఇచ్చింది. గతంలో ఇచ్చిన కోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ ఈ కూల్చివేత జరిగిందని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నమోదైన కేసు విచారణలో భాగంగా దగ్గుబాటి కుటుంబ సభ్యులు కోర్టుకు హాజరు కావడం తప్పనిసరి అని న్యాయస్థానం పేర్కొంది.



# అంజన్నా.. చంపేస్తున్నారయ్యా!

**కొండగట్టులో అధికారుల అలసత్వం.. కరెంట్ షాక్‌తో వృద్ధురాలు మృతి**

**ముందురోజే షాక్‌తో కోతి మృతి.. అయినా పట్టని అధికార యంత్రాంగం**

మల్యాల, అక్టోబర్ 16 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఘోరం జరిగింది. అజన్న దర్శనానికి వచ్చిన ఓ వృద్ధురాలు మృతి చెందటం విషాదాన్ని నింపింది. గోదావరిఖనికి చెందిన రాజేశ్వరి అనే 85 ఏళ్ల వృద్ధురాలు.. కుటుంబ సభ్యులతో కలిసి అంజనేయస్వామి దర్శనానికి కొండగట్టు వచ్చింది. స్వామికి తలనీలాలు సమర్పించాలని నిర్ణయించుకుని.. కొండపై ఉన్న కళ్యాణ కట్ట దగ్గరకు వెళ్లింది. వెంట్రుకలపై నీళ్లు చల్లుకోవటానికి వెళ్లిన సమయంలో.. ఆ పక్కనే ఉన్న కరెంట్ స్థంభాన్ని పట్టుకున్నది. ఆ కరెంట్ స్థంభానికి విద్యుత్ రావటంతో షాక్ కు గురైంది. అక్కడే స్పృహతప్పి పడిపోయింది. విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్పందించి.. జగిత్యాలలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు చెప్పారు డాక్టర్లు. స్వామి దర్శనానికి వచ్చి.. ఇలా కుటుంబ పెద్దను కోల్పోవటం ఆ కుటుంబాన్ని విషాదంలోకి నెట్టింది. కొండగట్టుపై కరెంట్ పోల్ కు తగిలి.. ముందు రోజే.. అంటే అక్టోబర్ 15వ తేదీ బుధవారం ఓ కోతి కూడా చనిపోయింది. అయినా ఆలయ అధికారులు, విద్యుత్ అధికారులు స్పందించకపోవడంతో ఓ వృద్ధురాలు ప్రాణం కోల్పోవాల్సి వచ్చింది.

# అధికారులతో ప్రభుత్వానికి చెడ్డపేరు

**వార్డు సభలు నిర్వహించడం లేదెందుకు?**

**అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి.. మాజీ మంత్రి వర్యులు తాటిపర్తి జీవన్ రెడ్డి**

జగిత్యాల టౌన్, అక్టోబర్ 16 (ఈవార్తలు): అధికారుల నిర్లక్ష్యం, అలసత్వంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని మాజీమంత్రి జీవన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జగిత్యాల పట్టణంలో ముందస్తు సమాచారం ఇవ్వకుండా వార్డు సభలు నిర్వహించి, కొందరికి మాత్రమే ఇండ్లను కేటాయించడం పట్ల మండిపడ్డారు. గురువారం జగిత్యాల మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా వార్డు సభలను ఎలా నిర్వహిస్తారని అధికారులను ప్రశ్నించారు. ఎంపిక చేసిన అర్హులతో పాటు అనర్హులుగా గుర్తించబడిన వారి వివరాలతో లిస్టు ఎందుకు విడుదల చేయలేదని నిలదీశారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ సమయంలో స్థలాలు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రెవెన్యూ, హౌసింగ్ శాఖల నుంచి నివేదిక తెప్పించుకొని అర్హులను గుర్తించాలని, పట్టణంలోని అన్ని వార్డుల్లో మళ్లీ వార్డు సభలను నిర్వహించి, అర్హులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందించారు.



# బీసీ బంద్‌ను విజయవంతం చేద్దాం

**పిలుపునిచ్చిన ఎమ్మెల్సీ ఎల్ రమణ**



జగిత్యాల టౌన్, అక్టోబర్ 16 (ఈవార్తలు): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కేలా పిలుపునిచ్చిన బీసీ బంద్‌కు సంపూర్ణ మద్దతు ఉంటుందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్ రమణ అన్నారు. పార్టీ శ్రేణులంతా ఈ బంద్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన గురువారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలు, 6 గ్యారెంటీలు, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీ అంతా మోసం అని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లపై పార్లమెంట్‌లో సవరణ చేయించకుండా, చట్టబద్ధత లేకుండా 42శాతం రిజర్వేషన్ ఇస్తామని బీసీ ప్రజలను మభ్యపెట్టేలా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వాన్ని నిలదీస్తూ ఈ నెల 18న బీసీ జేఏసీ బంద్‌కు మద్దతు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బంద్‌కు వ్యాపార, వాణిజ్య వర్గాలు సహకరించాలని కోరారు.



# ట్రాఫిక్, సైబర్ క్రైంపై విద్యార్థులకు అవగాహన

జగిత్యాల టౌన్, అక్టోబర్ 16 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓల్డ్ హై స్కూల్‌లో విద్యార్థులకు పోలీసులు ట్రాఫిక్ రూల్స్, సైబర్ క్రైంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్ మాట్లాడుతూ.. విద్యార్థులు 18 సంవత్సరాలు దాటిన తరువాత డ్రైవింగ్ లైసెన్స్ తీసుకొని వాహనాలు నడపాలని, బైక్‌పై వెళ్లే సమయంలో హెల్మెట్ ధరించాలని, కారులో ఉంటే సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. టౌన్ ఎస్సై రవి కిరణ్ మాట్లాడుతూ.. గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్ నుంచి సోషల్ మీడియాలో వచ్చే లింకులు ఓపెన్ చేయవద్దని చెప్పారు. వ్యక్తిగత ఫొటోలను సోషల్ మీడియాల్లో పోస్ట్ చేయొద్దని, ఏఐ ద్వారా మార్ఫింగ్ చేసి బ్లాక్ మెయిల్ చేసే ప్రమాదం ఉందని తెలిపారు. అవగాహన కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు సూర్య ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



# గొల్లపల్లి ఎమ్మార్వో ఆఫీస్ ఆకస్మిక తనిఖీ

గొల్లపల్లి, అక్టోబర్ 16 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం తహసిల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలపై ప్రతి దరఖాస్తులను పరిశీలించి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మీసేవ సర్టిఫికెట్లను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. కలెక్టర్ వెంట జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, గొల్లపెల్లి మండల తహసిల్దార్ ఎండీ మాజీద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీకి అండగా ఉంటాం

**చంద్రబాబు, పవన్ విజన్ అద్భుతం: ప్రధాని మోదీ**

కర్నూలు, అక్టోబర్ 16 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా పనిచేయడంతో అభివృద్ధి పరుగులు పెడుతోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రూపంలో రాష్ట్రానికి శక్తిమంతమైన నాయకత్వం లభించిందని, ఈ డబుల్ ఇంజిన్ సర్కార్ పాలనలో గత 16 నెలలుగా ఏపీ అపూర్వ ప్రగతి సాధిస్తోందని ప్రశంసించారు. గురువారం కర్నూలు జిల్లా నన్నూరు వద్ద నిర్వహించిన 'సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్' భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన, చేపట్టనున్న రూ. 13,429 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు వర్చువల్ విధానంలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. విద్యుత్, రైల్వే, జాతీయ రహదారులు, రక్షణ రంగాలకు చెందిన ఈ ప్రాజెక్టులు రాష్ట్రంలో కనెక్టివిటీని బలోపేతం చేస్తాయని, పరిశ్రమలకు ఊతమిచ్చి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయని ఆయన వివరించారు. ముఖ్యంగా ఈ ప్రాజెక్టుల వల్ల కర్నూలుతో పాటు పరిసర ప్రాంతాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. రాష్ట్ర నాయకత్వంపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. "ఏపీలో విజన్ ఉన్న చంద్రబాబు, పవన్ కల్యాణ్ లాంటి నేతలు ఉన్నారు. వారికి కేంద్ర ప్రభుత్వ పూర్తి సహకారం కూడా ఉంది. వీరి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళుతోంది" అని అన్నారు. ఏపీ అభివృద్ధికి కేంద్రం ఎల్లప్పుడూ అండగా ఉ ంటుందని భరోసా ఇచ్చారు. తెలుగులో "సోదర సోదరీమణులకు నమస్కారం" అంటూ ప్రసంగాన్ని ప్రారంభించిన మోదీ, అహోబిళం, మహానంది, మంత్రాలయం స్వాముల ఆశీస్సులు కోరుకుంటున్నట్లు తెలిపారు. తన జన్మస్థలమైన గుజరాత్‌లోని సోమనాథుడిని, కాశీ విశ్వనాథుడిని, శ్రీశైలం మల్లికార్జున స్వామిని స్మరించుకున్నారు. ఢిల్లీ, అమరావతి కలిసి పనిచేస్తుండటంతో అభివృద్ధి వేగంగా సాగుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. "గత 16 నెలల్లో డబుల్ ఇంజిన్ సర్కార్ కారణంగా ఏపీ అనూహ్య ప్రగతి సాధిస్తోంది. 2047 నాటికి మన దేశం వికసిత భారత్‌గా మారాలన్న లక్ష్యంలో ఆంధ్రప్రదేశ్ తన వంతు కీలక సహకారం అందిస్తోంది. 21వ శతాబ్దం 140 కోట్ల భారతీయులది" అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలే ప్రాధాన్యంగా తమ ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయని, అభివృద్ధే తమ విధానమని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే రాయలసీమ అభివృద్ధి చాలా ముఖ్యమని ప్రధాని నొక్కిచెప్పారు. ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పలు ప్రాజెక్టులు చేపడుతున్నట్లు తెలిపారు.



ముఖ్యంగా ఓర్వకల్లు, కొప్పర్తిలలో ఏర్పాటు చేస్తున్న పారిశ్రామిక కారిడార్లు రాయల సీమ రూపురేఖలను మారుస్తాయని, ఇక్కడ పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన వివరించారు. ఆంధ్రప్రదేశ్, భారతదేశ అభివృద్ధిని ప్రపంచమంతా గమనిస్తోందని ప్రధాని అన్నారు. గూగుల్ లాంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థ ఏపీలో భారీ పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చిందని గుర్తుచేశారు. "అమెరికా వెలుపల తమ అతిపెద్ద పెట్టుబడిని ఏపీలో పెడుతున్నట్లు గూగుల్ సీఈఓ స్వయంగా చెప్పారు. విశాఖలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) హబ్, డేటా సెంటర్, సబ్–సీ కేబుల్ వంటి భారీ ప్రాజెక్టులు రాబోతున్నాయి. ఈ సబ్–సీ కేబుల్ వ్యవస్థకు విశాఖ గేట్‌వేగా మారనుంది" అని మోదీ తెలిపారు. దేశ ఇంధన భద్రతలో ఏపీ కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాని కొనియాడారు. గతంలో దేశంలో విద్యుత్ సంక్షోభాలు ఉండేవని, ఇప్పుడు తమ ప్రభుత్వం క్లీన్ ఎనర్జీ ఉత్పత్తిలో రికార్డులు సృష్టిస్తోందని అన్నారు. దేశంలో తలసరి విద్యుత్ వినియోగం 1400 యూనిట్లకు పెరిగిందని, ప్రతి ఇంటికి, పరిశ్రమకు సరిపడా విద్యుత్ అందుబాటులో ఉందని చెప్పారు. చిత్తూరు ఎల్పీజీ బాట్లింగ్ ప్లాంట్ రోజుకు 20 వేల సిలిండర్లు నింపే సామర్థ్యంతో పనిచేస్తోందని, సహజవాయువు పైప్‌లైన్‌తో 15 లక్షల ఇళ్లకు గ్యాస్ సరఫరా అవుతుందని వివరించారు.

# జనవరిలో మరో ఏపీ డీఎస్సీ

అమరావతి, అక్టోబర్ 16 (ఈవార్తలు): ఏపీలో ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియను వేగవంతం చేసేందుకు పాఠశాల విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతిసారీ డీఎస్సీ నోటిఫికేషన్‌కు అడ్డంకిగా మారుతున్న న్యాయ వివాదాలకు ఈసారి ఫుల్‌స్టాప్ పెట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా, త్వరలో నిర్వహించబోయే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిబంధనల్లో భారీ మార్పులు చేయనుంది. ఇకపై టెట్ అర్హతలను పూర్తిగా జాతీయ ఉపాధ్యాయ విద్య మండలి (ఎన్‌సీటీఈ) మార్గదర్శకాలకు అనుగుణంగా అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు. గతంలో డీఎస్సీ నోటిఫికేషన్లు విడుదలైన ప్రతిసారీ అభ్యర్థుల అర్హతలు, డిగ్రీ మార్కులు వంటి అంశాలపై కోర్టు కేసులు దాఖలవుతూ నియామక ప్రక్రియ ఆలస్యమవుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు, ఈసారి టెట్ నోటిఫికేషన్ నుంచే ఎన్‌సీటీఈ నిబంధనలను కచ్చితంగా పాటించనున్నారు. దీంతో భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా నియామక ప్రక్రియ సజావుగా సాగుతుందని విద్యాశాఖ భావిస్తోంది. రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ ఇప్పటికే ప్రకటించినట్లుగా, జనవరిలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నోటిఫికేషన్‌లో సుమారు 2000 పోస్టులు ఉండే అవకాశం ఉంది. ఇందులో స్పెషల్ డీఎస్సీ కింద 1000 పోస్టులు, మెగా డీఎస్సీ–2025లో మిగిలిపోయిన 406 పోస్టులతో పాటు, ఈ ఏడాది పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుల ఖాళీలను కూడా కలపనున్నారు. పోస్టుల భర్తీలో విద్యార్థుల సంఖ్యను కూడా ప్రామాణికంగా తీసుకోనున్నారు.



# పోలవరం నిర్వాసితులకు 1100 కోట్ల ప్యాకేజీ

విజయవాడ, అక్టోబర్ 16 (ఈవార్తలు): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడనుంది. రాష్ట్ర ప్రభుత్వం వారి సహాయ, పునరావాస ప్యాకేజీ కోసం ఏకంగా రూ. 1,100 కోట్లను విడుదల చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం గతంలో అడ్వాన్సుగా ఇచ్చిన నిధులలో మిగిలి ఉన్న రూ. 1,800 కోట్ల నుంచి ఈ మొత్తాన్ని ప్రాజెక్టు ప్రత్యేక ఖాతాకు రాష్ట్ర ఆర్థిక శాఖ మళ్లించింది. ఈ నిధులు ప్రాజెక్టు తొలిదశలో 41.15 మీటర్ల కాంటూరు పరిధిలోని నిర్వాసితులకు పరిహారం చెల్లించడానికి దాదాపుగా సరిపోతాయని జలవనరుల శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరో రూ. 100 కోట్లు అందితే ఈ దశ చెల్లింపులు సంపూర్ణంగా పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ నిర్వాసితులకు చెల్లింపులు జరపడంలో జాప్యంపై కేంద్ర ప్రభుత్వం కొంతకాలంగా ఒత్తిడి తెస్తోంది. ఈ నెల ఆరంభంలో ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ అంశంపై తీవ్రంగా చర్చ జరిగింది. బడ్జెట్‌లో కేటాయించిన నిధులను నిర్ణీత సమయంలో ఖర్చు చేయకపోతే అవి మురిగిపోయే ప్రమాదం ఉందని కేంద్ర ఆర్థిక శాఖ అధికారులు హెచ్చరించారు. దీంతో, చెల్లింపుల ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని మంత్రి పాటిల్ రాష్ట్ర అధికారులను ఆదేశించారు. ఈ సమాచారాన్ని మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో ప్రభుత్వం తక్షణమే స్పందించింది. దీని ఫలితంగానే రాష్ట్ర ఆర్థిక శాఖ మంగళవారం రూ. 1,100 కోట్లను విడుదల చేసింది. కాగా, గత ఏడాది కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే దాదాపు రూ. 1,000 కోట్లను నిర్వాసితుల ఖాతాల్లో జమ చేసిన విషయం తెలిసిందే. ఈసారి కూడా లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా డబ్బు జమ చేసి, వారితో కలిసి ఒక సభను నిర్వహించాలని మంత్రి నిమ్మల రామానాయుడు భావిస్తున్నట్లు సమాచారం.

# రెచ్చగొట్టే పోస్టులు పెడితే జైలే

**ఏపీ డీజీపీ హరీశ్ గుప్తా**

అమరావతి, అక్టోబర్ 16 (ఈవార్తలు): సామాజిక మాధ్యమాలను అడ్డం పెట్టుకుని విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టేలా పోస్టులు పెట్టినా, ఇతరులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని, అలాంటి వారు జైలుకు వెళ్లడం ఖాయమని ఆయన బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కంటెంట్‌పై రాష్ట్రంలోని అన్ని సైబర్ విభాగాలు సమన్వయంతో ప్రత్యేక నిఘా పెట్టాయని వెల్లడించారు. ప్రముఖులైనా, సామాన్యులైనా ఎవరి గౌరవానికి భంగం కలిగించినా ఉపేక్షించేది లేదని డీజీపీ తేల్చి చెప్పారు. ఫొటోలు, వీడియోలు లేదా కనీసం వ్యాఖ్యల రూపంలో రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే చట్టపరమైన ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ పౌరులు సహా ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ వేదికలను జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి, సృజనాత్మక చర్చలకు వాడుకోవాలని కోరారు. ఇటీవల పెరుగుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ దుర్వినియోగంపై కూడా డీజీపీ తీవ్రంగా స్పందించారు. ఏఐ సాయంతో ఫేక్ వీడియోలు సృష్టించి అశాంతికి కారణమయ్యే వారిని పోలీసులు ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోరని, వారు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా, ఉద్రిక్తతలు సృష్టించే పోస్టులను ఇతరులతో పంచుకున్నా (షేర్ చేసినా) చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు.

# మోదీ కర్మయోగి

**ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్**

కర్నూలు, అక్టోబర్ 16 (ఈవార్తలు): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏ విధమైన ఫలితాలూ ఆశించకుండా దేశం కోసం పనిచేసే ఒక కర్మయోగి అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కొనియాడారు. దేశ సేవే లక్ష్యంగా ప్రధాని ముందుకు సాగుతున్నారని ఆయన ప్రశంసించారు. కర్నూలు శివారు నన్నూరు వద్ద నిర్వహించిన 'సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్స్' బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "ప్రధాని మోదీ కేవలం దేశాన్ని మాత్రమే కాకుండా, ఏకంగా రెండు తరాలను ముందుకు నడిపిస్తున్నారు. ఆత్మనిర్భర్ భారత్ వంటి కార్యక్రమాలతో దేశం తలెత్తుకునేలా చేశారు. భారత పతాకానికి ఉన్న పౌరుషంలాగే, ప్రపంచ పటంలో దేశ ప్రతిష్ఠను ఆయన నిలబెట్టారు" అని అన్నారు. కూటమి బలోపేతంపై కూడా పవన్ కీలక వ్యాఖ్యలు చేశారు. "మన కూటమి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తట్టుకుని నిలబడాలి. కనీసం 15 ఏళ్లకు తక్కువ కాకుండా బలంగా కొనసాగాలి" అని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక తరం భవిష్యత్తు కోసం ఆలోచించే గొప్ప నాయకుడని కీర్తించారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయకత్వంలో తామంతా సమష్టిగా పనిచేస్తామని, రాబోయే తరాల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కృషి చేస్తామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.






# రష్యా చమురు ఆపేస్తామన్నారు!

## మోదీ నాకు మాటిచ్చారు

**ఆయనకు నేనంటే చాలా ప్రేమ.. ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు**

**ఉక్రెయిన్ యుద్ధం త్వరగా ముగుస్తుందని వెల్లడి**

**భారత ప్రధాని నరేంద్ర మోదీ తనకు ఒక కీలక హామీ ఇచ్చారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ త్వరలోనే నిలిపివేస్తుందని మోదీ తనతో చెప్పారని ఆయన వెల్లడించారు. ఈ నిర్ణయం వల్ల ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలకడం సులభమవుతుందని ట్రంప్ అభిప్రాయపడ్డారు.**

వాషింగ్టన్: వైట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీని గొప్ప వ్యక్తిగా, కాలపరీక్షకు నిలిచిన నేతగా ట్రంప్ ప్రశంసించారు. "మోదీ చాలా గొప్ప వ్యక్తి. నేనంటే ఆయనకు ఇష్టం, నాకూ ఆయనంటే ఇష్టం" అని పేర్కొన్నారు. వెంటనే తన వ్యాఖ్యను సరిదిద్దుకుంటూ, "ప్రేమ అనే పదాన్ని తప్పుగా అర్థం చేసుకోవద్దు. ఆయన రాజకీయ జీవితాన్ని ఇబ్బందుల్లో పెట్టడం నాకు ఇష్టం లేదు" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. భారత్‌ను ఒక అద్భుతమైన దేశంగా అభివర్ణించిన ట్రంప్, ఒకప్పుడు తరచూ నాయకులు మారే పరిస్థితి ఉండేదని, కానీ మోదీ చాలా కాలంగా స్థిరమైన పాలన అందిస్తున్నారని కొనియాడారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను ఆపేస్తామని మోదీ తనకు హామీ ఇచ్చారని ట్రంప్ స్పష్టం చేశారు. "రష్యా నుంచి ఇకపై చమురు కొనుగోలు చేయబోమని ఆయన నాకు హామీ ఇచ్చారు. ఇది వెంటనే సాధ్యం కాకపోవచ్చు. దీనికి కొంత సమయం పడుతుంది, కానీ ఈ ప్రక్రియ త్వరలోనే ముగుస్తుంది" అని ట్రంప్ వివరించారు. భారత్ కనుక చమురు కొనడం ఆపేస్తే, యుద్ధాన్ని ఆపడం మరింత తేలికవుతుందని ఆయన అన్నారు. యుద్ధం ముగిసిన తర్వాత భారత్ మళ్లీ రష్యాతో వ్యాపారం చేసుకోవచ్చని సూచించారు. గతంలో ఉక్రెయిన్ యుద్ధానికి రష్యాకు భారత్ ఆర్థికంగా సహకరిస్తోందని ఆరోపించిన ట్రంప్, తాజా వ్యాఖ్యలతో ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడినట్లు సంకేతాలు ఇచ్చారు. అయితే, ట్రంప్ చేసిన ఈ కీలక ప్రకటనపై భారత ప్రభుత్వం ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. 2022 నుంచి రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం కొనసాగుతున్న విషయం తెలిసిందే.

## ట్రంప్ మనకేమైనా తండ్రా?

**కేంద్రంపై కాంగ్రెస్ ఎంపీ ఘాటు వ్యాఖ్యలు.. రష్యా నుంచి మోదీ ఆయిల్ కొనుగోళ్లు ఆపేస్తారన్న ట్రంప్**

**రష్యాకు మద్దతు.. ఇమ్రాన్ మసూద్.. భారత ప్రభుత్వ నిర్ణయాలనూ ట్రంప్ ప్రకటిస్తున్నారన్న జైరాం రమేశ్**



న్యూఢిల్లీ: రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లను నిలిపివేస్తుందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో మండిపడింది. ఈ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వహించడాన్ని ప్రశ్నిస్తూ కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ తీవ్ర విమర్శలు చేశారు. "ట్రంప్ మనకు తండ్రా ఏంటి? మన ప్రధాని మౌనంగా ఉంటే, మనకు అన్నీ ఆయనే చెబుతారా? దీని వెనుక ఉన్న రహస్యం ఏంటి?" అంటూ ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ మసూద్ మాట్లాడుతూ, "రష్యా మన చిరకాల మిత్రుడు. మేం రష్యాకు అండగా నిలుస్తామని ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలి. ట్రంప్ మనకిస్తేనే మనం రొట్టెలు తింటామా? ప్రపంచంలో భారత్ చాలా పెద్ద మార్కెట్, కాబట్టి ట్రంప్ మనల్ని విస్మరించలేరు. ఆయన కేవలం తన ప్రయోజనాల గురించే ఆలోచిస్తారు. చైనాతో విభేదాలు ఉన్నప్పటికీ అమెరికా పాకిస్థాన్‌కు మద్దతిస్తోంది. ఈ పరిణామాలను గమనిస్తే మనకు ఎవరూ లేరని, మనం ఎవరికీ చెందినవాళ్లం కాదని అర్థమవుతుంది" అని అన్నారు. మరోవైపు, కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ కూడా ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. "భారత ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను వాషింగ్టన్‌లో ట్రంప్ ప్రకటిస్తున్నారు" అని ఆయన విమర్శించారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్ల వెనుక ఉన్న నిజమేంటో, అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఎందుకు ఇంకా పూర్తికాలేదో ప్రధాని మోదీ పార్లమెంటుకు వివరించాలని డిమాండ్ చేశారు. భారత విదేశాంగ విధానం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు.

## సిగ్ 716 రైఫిల్స్‌కు నైట్ సైట్స్

**భారత సైన్యం మరింత పటిష్ఠం**

**రూ.659.47 కోట్లతో కీలక ఒప్పందం**

**రాత్రిపూట 500 మీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం**

**స్వదేశీ సంస్థలైన ఎంకేయూ, మెడ్బిట్ టెక్నాలజీస్‌తో ఒప్పందం**

న్యూఢిల్లీ: భారత సైనిక సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా రక్షణ మంత్రిత్వ శాఖ కీలక ముందడుగు వేసింది. సైన్యం వినియోగిస్తున్న సిగ్ 716 అసాల్ట్ రైఫిల్స్ కోసం అత్యాధునిక నైట్ సైట్స్ (ఇమేజ్ ఇంటెన్సిఫైయర్స్) కొనుగోలు చేసేందుకు రూ.659.47 కోట్ల విలువైన ఒప్పందంపై సంతకాలు చేసింది. ఈ ఒప్పందం 'ఆత్మనిర్భర భారత్' లక్ష్యానికి అనుగుణంగా జరగడం విశేషం. ఈ కొత్త నైట్ సైట్స్ ద్వారా సైనికుల రాత్రిపూట యుద్ధ సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. నక్షత్రాల వెలుగులో సైతం 500 మీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను కూడా అత్యంత కచ్చితత్వంతో ఛేదించేందుకు ఇవి వీలు కల్పిస్తాయని రక్షణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం వాడుకలో ఉన్న పాతతరం పాసివ్ నైట్ సైట్స్ (పీఎన్ఎస్) కంటే ఇవి ఎంతో మెరుగైనవని పేర్కొంది. సిగ్ 716 రైఫిల్స్ పూర్తి సామర్థ్యాన్ని రాత్రివేళల్లో కూడా ఉపయోగించుకోవడానికి ఈ పరికరాలు ఎంతగానో దోహదపడతాయి. ఈ కొనుగోలును 'బై (ఇండియన్-ఐడీడీఎం)' కేటగిరీ కింద చేపట్టారు. ఒప్పందం ప్రకారం, ఈ నైట్ సైట్స్ తయారీలో 51 శాతానికి పైగా స్వదేశీ పరిజ్ఞానం, విడిభాగాలు ఉంటాయి. దీనివల్ల దేశీయ రక్షణ పరిశ్రమలకు, ముఖ్యంగా విడిభాగాలు సరఫరా చేసే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈలు) పెద్ద ప్రోత్సాహం లభిస్తుందని ప్రభుత్వం విశ్వాసం వ్యక్తం చేసింది. ఈ ఒప్పందంపై అక్టోబర్ 15న ఎంకేయూ లిమిటెడ్, మెడ్బిట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కన్సార్టియంతో రక్షణ మంత్రిత్వ శాఖ సంతకాలు చేసింది. ఈ నిర్ణయం సైన్యాన్ని ఆధునికీకరించడమే కాకుండా, రక్షణ రంగంలో స్వావలంబన సాధించేందుకు దోహదపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## యుద్ధానికి ముందే సేనాని పారిపోయాడు

**ప్రశాంత్ కిశోర్‌పై బీజేపీ సెటైర్లు.. బీహార్ ఎన్నికల బరి నుంచి తప్పుకున్న పీకే**



పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేయడం లేదని జన్ సూరజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ (పీకే) ప్రకటించడం రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీసింది. ఈ నిర్ణయంపై బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్ ఘాటుగా స్పందించారు. "యుద్ధం ప్రారంభం కాకముందే సేనాని పారిపోయాడు. ఇక సైన్యం పరిస్థితి ఏంటి?" అంటూ ఆయన పీకేను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. బీజేపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు పాట్నా చేరుకున్న అనురాగ్ ఠాకూర్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పీకే నిర్ణయం, ఆయన పార్టీ భవిష్యత్తుపై తీవ్ర వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అంతకుముందు రోజు, తాను ఎన్నికల బరిలో నిలబడటం లేదని ప్రశాంత్ కిషోర్ ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. పార్టీ సంస్థాగత పనులపైనే పూర్తిగా దృష్టి సారించాలని జన్ సూరజ్ నిర్ణయించిందని, అందుకే తాను పోటీకి దూరంగా ఉంటున్నానని ఆయన తెలిపారు. ఇదే సమయంలో, బీహార్‌లో అధికార ఎన్డీయే ఓటమి ఖాయమని పీకే జోస్యం చెప్పారు. ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ తిరిగి రాలేరని, ఆయన నేతృత్వంలోని జేడీయూ 25 సీట్లు గెలవడం కూడా కష్టమేనని అన్నారు. తమ పార్టీకి 150 సీట్ల కంటే తక్కువ వస్తే అది ఓటమి కిందే లెక్క అని ఆయన పేర్కొన్నారు. పీకే నిర్ణయంపై బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా కూడా విమర్శలు గుప్పించారు. "ప్రశాంత్ కిషోర్ ఒక తెలివైన వ్యాపారవేత్త, ఎన్నికల ప్రచారకర్త. క్షేత్రస్థాయిలో పరిస్థితి అనుకూలంగా లేదని ఆయనకు అర్థమైంది. ఈ ఎన్నికల్లో ఓడిపోతే భవిష్యత్తులో తన వ్యాపారానికి గిరాకీ ఉండదనే భయంతోనే పోటీ నుంచి తప్పుకున్నారు" అని పూనావాలా ఆరోపించారు. ఇదే సందర్భంలో, బీజేపీ ప్రకటించిన 101 మంది అభ్యర్థుల్లో ఒక్క ముస్లిం కూడా లేకపోవడంపై అడిగిన ప్రశ్నకు అనురాగ్ ఠాకూర్ బదులిచ్చారు. "మేము గెలుపు గుర్రాలకే టికెట్లు ఇస్తాం. మతం, కులం ఆధారంగా ప్రజలకు సౌకర్యాలు కల్పించం. సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్‌కే మా ప్రాధాన్యత" అని ఆయన వివరించారు. కాగా, బీహార్‌లోని మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 6, 11 తేదీల్లో పోలింగ్ జరగనుంది. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు.

## కుప్పకూలిన భారత ఎగుమతులు!

**అమెరికా సుంకాల ప్రభావం**

**4 నెలల వ్యవధిలో 37.5 శాతం పడిపోయిన ఎగుమతులు**



న్యూఢిల్లీ/న్యూయార్క్: అమెరికా మార్కెట్‌లో భారత ఎగుమతులు పెను సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. వాషింగ్టన్ ప్రభుత్వం భారత వస్తువులపై 50 శాతం మేర భారీ సుంకాలను విధించడంతో కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే అమెరికాకు మన ఎగుమతులు 37.5 శాతం మేర కుప్పకూలాయి. ఈ ఆందోళనకర విషయాన్ని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) తన తాజా నివేదికలో వెల్లడించింది. జీటీఆర్ఐ గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది మే 2025 నుంచి సెప్టెంబర్ 2025 మధ్య కాలంలో అమెరికాకు భారత ఎగుమతులు తీవ్రంగా పడిపోయాయి. మే నెలలో 8.8 బిలియన్ డాలర్లుగా ఉన్న ఎగుమతులు, సెప్టెంబర్ నాటికి 5.5 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. అంటే, ఈ నాలుగు నెలల్లోనే నెలవారీ ఎగుమతుల విలువలో భారత్ ఏకంగా 3.3 బిలియన్ డాలర్లను కోల్పోయింది. వరుసగా నాలుగు నెలల పాటు ఎగుమతులు క్షీణించడం ఇదే తొలిసారి. అమెరికా విధించిన 50 శాతం సుంకాలు పూర్తిగా అమల్లోకి వచ్చిన తర్వాత, సెప్టెంబర్ నెలలో అత్యంత తీవ్రమైన ప్రభావం కనిపించింది. ఆగస్టులో 6.87 బిలియన్ డాలర్లుగా ఉన్న ఎగుమతులు, సెప్టెంబర్‌లో ఏకంగా 20.3 శాతం తగ్గి 5.5 బిలియన్ డాలర్లకు చేరాయి. 2025లో ఒకే నెలలో ఇంతటి భారీ పతనం నమోదు కావడం ఇదే మొదటిసారి అని నివేదిక స్పష్టం చేసింది. ఈ సుంకాల ప్రభావం ముఖ్యంగా టెక్స్‌టైల్, జెమ్స్ అండ్ జువెలరీ, ఇంజినీరింగ్ వస్తువులు, రసాయనాల వంటి కీలక రంగాలపై పడింది. ఈ రంగాల నుంచి ఎగుమతులు భారీగా పడిపోవడంతో మొత్తం ఎగుమతులపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, అమెరికా వంటి అతిపెద్ద మార్కెట్‌లో భారత తయారీ, ఎగుమతి రంగాల పోటీతత్వం దెబ్బతినే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాషింగ్టన్ విధించిన సుంకాలే ఈ పతనానికి ప్రత్యక్ష కారణమని స్పష్టం చేసిన జీటీఆర్ఐ, భారత వాణిజ్య ప్రయోజనాలను కాపాడుకోవడానికి తక్షణమే విధానపరమైన సమీక్ష చేపట్టాలని సూచించింది.

## ఒవైసీ కొత్త కూటమి

**బీహార్ ఎన్నికల వేళ సంచలనం**

**ఆజాద్ సమాజ్, రాష్ట్రీయ శోషిత్ సమాజ్ పార్టీలతో పొత్తు**

**35 స్థానాల్లో ఎంఐఎం, 25 చోట్ల ఆజాద్ సమాజ్ పార్టీ పోటీ**

పాట్నా/హైదరాబాద్: బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈ క్రమంలో, అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఏఐఎంఐఎం పార్టీ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో రెండు ఇతర పార్టీలతో కలిసి కొత్త రాజకీయ కూటమిని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో బీహార్ రాజకీయాల్లో మరో కొత్త ఫ్రంట్ ఆవిర్భవించినట్లయింది. కిషన్‌గంజ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంఐఎం రాష్ట్ర అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమాన్ ఈ పొత్తు వివరాలను వెల్లడించారు. ఆజాద్ సమాజ్ పార్టీ, స్వామి ప్రసాద్ మౌర్యకు చెందిన రాష్ట్రీయ శోషిత్ సమాజ్ పార్టీలతో కలిసి తమ కూటమి ఎన్నికల బరిలో నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. మతతత్వ శక్తులను నిలువరించడమే తమ ప్రధాన లక్ష్యమని ఇమాన్ పేర్కొన్నారు. ఈ కూటమిలో భాగంగా సీట్ల పంపకాలపై కూడా స్పష్టతనిచ్చారు. మొత్తం మీద ఏఐఎంఐఎం 35 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయనుండగా, ఆజాద్ సమాజ్ పార్టీకి 25 సీట్లు, రాష్ట్రీయ శోషిత్ సమాజ్ పార్టీకి 4 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ దాదాపు పూర్తయిందని, త్వరలోనే వారి పేర్లను అధికారికంగా ప్రకటిస్తామని ఆయన వివరించారు. తమ కూటమి అధికారం కోసం కాకుండా, దేశంలో న్యాయాన్ని నెలకొల్పడం కోసం పోరాడుతుందని అఖ్తరుల్ ఇమాన్ అన్నారు. ఈ మూడు పార్టీల కలయికతో బీహార్ ప్రజలకు ఓ సరికొత్త రాజకీయ ప్రత్యామ్నాయాన్ని అందిస్తున్నామని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా కిషన్‌గంజ్, కతిహార్, అరారియా వంటి జిల్లాలున్న సీమాంచల్ ప్రాంతంలో తన బలాన్ని మరింత పెంచుకునేందుకు ఒవైసీ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు ఈ పరిణామం స్పష్టం చేస్తోంది.

## పాక్ నుంచి ట్రంప్ కొడుక్కి డబ్బు

**అందుకే భారత్‌తో బంధం తెంచుకున్నారు**

**అమెరికా మాజీ రాయబారి రహమ్ ఇమ్మాన్యుయేల్**

న్యూయార్క్: 40 సంవత్సరాలుగా భారత్ తో అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతోందని అగ్రరాజ్యానికి చెందిన మాజీ రాయబారి రహమ్ ఇమాన్యుయేల్ పేర్కొన్నారు. ఈ కీలకమైన భాగస్వామ్యాన్ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన అహంభావంతో, తన స్వార్థం కోసం చెడగొడుతున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రంప్ కుమారుడికి పాకిస్థాన్ నుంచి పెద్ద మొత్తంలో డబ్బు ముడుతోందని ఆరోపిస్తూ.. ఈ డబ్బు కోసమే ట్రంప్ భారత్ పై కక్ష కట్టారని పేర్కొన్నారు. తన స్వార్థం కోసం అమెరికా ప్రయోజనాలను కూడా పక్కన పెడుతున్నారని విమర్శించారు. చైనాను ఎదుర్కోవడంలో అమెరికాకు అత్యంత కీలకమైన, నమ్మకమైన భాగస్వామి భారతదేశమేనని ఇమాన్యుయేల్ చెప్పారు. ఆ విషయాన్ని గుర్తించకుండా అధ్యక్షుడు ట్రంప్ అహం చూపిస్తున్నారు. భారత్ పాక్ ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిర్చింది తానేనని ట్రంప్ చేసుకుంటున్న ప్రచారాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ తోసిపుచ్చడమూ ఓ కారణమేనని చెప్పారు. కాగా, రహమ్ ఇమాన్యుయేల్ గతంలో జపాన్ కు అమెరికా రాయబారిగా వ్యవహరించారు. ఈ క్రమంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో అమెరికా, భారత్ సంబంధాలపై ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

## మోదీకి ట్రంప్ భయం

**అందుకే రష్యా ఆయిల్‌పై మౌనం.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు**

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీకి ట్రంప్ అంటే భయం పట్టుకుందని ఆయన ఎద్దేవా చేశారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు నిలిపివేస్తుందని ట్రంప్ చేసిన ప్రకటనపై కేంద్ర ప్రభుత్వం ఇంకా స్పందించక ముందే రాహుల్ ఈ విమర్శలు చేయడం గమనార్హం. ప్రధాని నరేంద్ర మోదీని 'గొప్ప వ్యక్తి' అని, భారత్‌ను 'అద్భుతమైన దేశం' అని పొగిడిన ట్రంప్, అదే సమయంలో రష్యా నుంచి చమురు కొనుగోలు చేయబోమని మోదీ తనకు హామీ ఇచ్చారని సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఈ ప్రక్రియ వెంటనే పూర్తికాదు. కానీ త్వరలోనే ముగుస్తుంది. వారు తక్కువ సమయంలోనే రష్యా నుంచి చమురు కొనడం ఆపేస్తారు" అని ట్రంప్ విలేకరులతో అన్నారు. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఘాటుగా స్పందించారు. "ప్రధాని మోదీకి ట్రంప్ అంటే భయం" అంటూ విమర్శనాస్త్రాలు సంధించారు. "రష్యా నుంచి ఆయిల్ కొనబోమని చెప్పే నిర్ణయాన్ని, ఆ ప్రకటనను కూడా ట్రంప్‌కే వదిలేశారు. ఎన్నిసార్లు అవమానించినా అభినందన సందేశాలు పంపుతూనే ఉన్నారు. ఆర్థిక మంత్రి అమెరికా పర్యటనను కూడా రద్దు చేశారు" అని రాహుల్ ఆరోపించారు. గత సెప్టెంబర్ నెలలో కూడా భారత్ తన మొత్తం ముడిచమురు దిగుమతుల్లో 34 శాతం రష్యా నుంచే కొనుగోలు చేసింది. భారత్ ఇప్పటికీ రష్యాకు అతిపెద్ద చమురు కొనుగోలుదారుగా కొనసాగుతున్న తరుణంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు అమెరికా నుంచి సరైన ధరకు లభిస్తే సుమారు 12-13 బిలియన్ డాలర్ల విలువైన ముడిచమురు, సహజ వాయువును దిగుమతి చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని భారత వాణిజ్య మంత్రిత్వ శాఖ బుధవారం ప్రకటించింది. ప్రస్తుతం వాషింగ్టన్‌లో ఇరు దేశాల మధ్య వాణిజ్య చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ఈ పరిణామాలు రాజకీయంగా ఆసక్తిని రేపుతున్నాయి.

## గుజరాత్ మంత్రులంతా రాజీనామా

**సీఎం మినహా మిగతావారు రిజైన్.. నేడు నూతన మంత్రివర్గం ప్రమాణం**

గాంధీనగర్: గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మినహా మిగిలిన మంత్రులందరూ తమ పదవులకు రాజీనామా చేశారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు మార్గం సుగమం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 12:39 గంటలకు నూతన మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేయనుంది. "ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ తన మంత్రివర్గాన్ని శుక్రవారం మధ్యాహ్నం విస్తరించనున్నారు" అని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. మంత్రివర్గంలో దాదాపు 10 మంది కొత్త వారికి అవకాశం లభించవచ్చని బీజేపీకి చెందిన ఒక సీనియర్ నాయకుడు తెలిపారు. అంతేకాకుండా, ప్రస్తుత ఉన్న మంత్రుల్లో దాదాపు సగం మందిని మార్చే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం గుజరాత్ మంత్రివర్గంలో ముఖ్యమంత్రితో సహా మొత్తం 17 మంది మంత్రులు ఉన్నారు. వీరిలో ఎనిమిది మంది క్యాబినెట్ ర్యాంకు మంత్రులు కాగా, మిగిలిన వారు సహాయ మంత్రులుగా కొనసాగుతున్నారు.

## నెస్లేలో 16,000 మంది ఇంటికి

**భారీగా ఉద్యోగాల కోత.. రాబోయే రెండేళ్లలో తొలగింపు పూర్తి**

**ప్రకటనతో 8 శాతానికిపైగా ఎగిసిన కంపెనీ షేర్లు**

న్యూఢిల్లీ: ప్రముఖ అంతర్జాతీయ ఆహార ఉత్పత్తుల దిగ్గజం నెస్లే సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రపంచవ్యాప్తంగా తమ సంస్థలో పనిచేస్తున్న 16,000 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు గురువారం ప్రకటించింది. ఈ వార్త ఉద్యోగులను ఆందోళనకు గురిచేసినప్పటికీ, స్టాక్ మార్కెట్లో మాత్రం కంపెనీ షేర్ల ధర 8 శాతానికి పైగా పెరగడం గమనార్హం. ఈ ఏడాది సెప్టెంబర్‌లో నెస్లే చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా బాధ్యతలు చేపట్టిన ఫిలిప్ నవ్రతిల్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. "ప్రపంచం వేగంగా మారుతోంది. దానికి అనుగుణంగా నెస్లే కూడా వేగంగా మారాల్సిన అవసరం ఉంది. సిబ్బందిని తగ్గించడం కఠినమైన నిర్ణయమే అయినా, ప్రస్తుత పరిస్థితుల్లో ఇది తప్పనిసరి" అని ఆయన పేర్కొన్నారు. రాబోయే రెండేళ్లలో ఈ తొలగింపుల ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు కంపెనీ తెలిపింది. ఉద్యోగాల కోతలో భాగంగా 12,000 వైట్ కాలర్ ఉద్యోగాలను, మరో 4,000 ప్రొడక్షన్, సప్లై చైన్ విభాగాల్లోని ఉద్యోగాలను తగ్గించనున్నారు.

లగ్జరీ చిత్రం




## అల్లు అర్జున్-ప్రశాంత్ వర్మ కాంబో?




పుష్ప తర్వాత అల్లు అర్జున్ కూడా పాన్ ఇండియా ప్రాజెక్ట్స్ తో బిజీ అయ్యాడు. ప్రస్తుతం అట్లీతో సినిమా ఒకటి చేస్తున్నాడు. ఆ సినిమా తర్వాత డైరెక్టర్స్ లిస్ట్ చాలా పెద్దగానే ఉంది. ఐతే అల్లు అర్జున్ ఎవరితో చేస్తాడన్నది సస్పెన్స్ గానే ఉంది. ఈలోగా ప్రభాస్ తో ప్రశాంత్ వర్మ చేయాలనుకున్న కథను అల్లు అర్జున్ తో చేస్తే బాగుంటుందని అనుకుంటున్నారు. అదే జరిగితే మాత్రం ఐకాన్ స్టార్ ఫ్యాన్స్ కి ఫెస్టివల్ ట్రీట్ అన్నట్టే లెక్క. ప్రశాంత్ వర్మ కూడా హనుమాన్ తో సూపర్ హిట్ అందుకోగా.. ఆ నెక్స్ట్ మహాకాళీ, జై హనుమాన్ సినిమాలు చేస్తున్నాడు. ఈ సినిమాల తర్వాతే ప్రభాస్ సినిమా ఉండే అవకాశం ఉంది. సో ప్రభాస్ తో ప్రశాంత్ నీల్ సినిమా కుదరకపోయినా అల్లు అర్జున్ తో సినిమా ఉండే ఛాన్స్ ఉందని తెలుస్తుంది.





## బండ్ల గణేష్ సంచలన ట్వీట్

బండ్ల గణేష్ సోషల్ మీడియాలో సంచలన పోస్ట్ పెట్టారు. అది పీకుతా, ఇది పీకుతా అని చెప్పాల్సిన పనిలేదు.. మాటలు మన చేతిలో ఉన్నప్పటికీ, ఆట ఎవరిదో జనాలు తీర్మానిస్తారు అంటూ రాసుకొచ్చారు. దీంతో బండ్ల గణేష్ పెట్టిన పోస్ట్.. క్షణాల్లో వైరల్‌గా మారింది. సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతోంది. దీంతో అనేక మంది నెటిజన్లు, సినీ ప్రియులు స్పందిస్తున్నారు. ఒక్కొక్కరు ఒక్కోలా రెస్పాండ్ అవుతున్నారు. రకరకాల కామెంట్స్ పెడుతున్నారు. బండ్ల గణేష్ ఎవరినో ఉద్దేశించి కావాలనే పోస్ట్ పెట్టారని అంటున్నారు. ఎవరో చేసిన కామెంట్లకు ఇప్పుడు బండ్ల గణేష్ పరోక్షంగా స్పందించారని అభిప్రాయపడుతున్నారు. కామెంట్ నిజంగా ఎవరిని ఉద్దేశించి చేశారో.. లేదా సాధారణంగా ఇండస్ట్రీలో జరుగుతున్న పరిణామాలపైనా? అన్నది అనేది ఆయనకే తెలియాలి.



## విజయ్ దేవరకొండ.. విశ్వరూపం!

'విజయ్ దేవరకొండ విశ్వరూపం చూస్తారు!'.. దర్శకుడు రాహుల్ సంకృత్యన్ 'డ్యూడ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అన్న ఈ ఒక్క మాట, ఇప్పుడు ఇండస్ట్రీలో పెద్ద చర్చకు దారితీసింది. ఇది కేవలం సినిమాపై హైప్ పెంచడానికి వాడిన పదంలా కాకుండా, దాని వెనుక ఒక లోతైన అర్థం ఉందనే విశ్లేషణలు మొదలయ్యాయి. ముఖ్యంగా, విజయ్ దేవరకొండ కెరీర్ గ్రాఫ్‌ను, రాహుల్ సంకృత్యన్ గత చిత్రాల స్టైల్ మేకింగ్ ని గమనిస్తున్న వారికి, ఈ 'విశ్వరూపం' అనే మాటలో ఒక 'కాంతార' లాంటి ప్రాజెక్ట్ దాగి ఉందేమో అనే ఆసక్తి మొదలైంది. రాహుల్ సంకృత్యన్ ఒక విలక్షణమైన దర్శకుడు. అతని మొదటి చిత్రం ట్యాక్సీవాలాలో 'ఆత్మ' అనే శక్తిని, రెండో చిత్రం శ్యామ్ సింగ రాయ్‌లో పూర్వజన్మ అనే ఆధ్యాత్మిక కాన్సెప్ట్‌ను కథలో కీలక అంశాలుగా మార్చారు. ఇప్పుడు మూడో సినిమాకు ఏకంగా 'విశ్వరూపం' అనే పదం వాడారంటే, ఈసారి కేవలం ఆత్మలనో, పునర్జన్మలనో కాకుండా, అంతకు మించిన ఒక దైవిక శక్తిని కథలో చూపించబోతున్నారని స్పష్టమవుతోంది. ఇది విజయ్ దేవరకొండ కెరీర్‌కు అత్యంత కీలకమైన ప్రాజెక్ట్‌గా మారే అవకాశం ఉంది.



### మెటా ఏఐకి
## దీపిక గొంతు

ఈ మధ్య వివాదాలతో ట్రెండ్ అవుతున్న దీపిక పడుకోన్.. సరికొత్త అవతారం ఎత్తబోతున్నారు. మెటా ఏఐకి తన గొంతును అందించిన ఘనత వహించారు. మెటా ఏఐలో భాగమైనట్లు ఒక వీడియోను సోషల్ మీడియాలో పంచుకోవడంతో ఈమెకు మరొకసారి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని సెలబ్రిటీలు, అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## చిరు మాజీ భార్యగా నయన్

రీఎంట్రీలో మెగాస్టార్ చిరంజీవి ఇప్పటిదాకా చేసినవి ఆరు సినిమాలు. 'మన శంకర వర ప్రసాద్' ఏడో సినిమా. ఈ ఏడు చిత్రాల్లో మూడుసార్లు చిరుతో జట్టు కట్టిన కథానాయిక నయనతార. సీనియర్ స్టార్లకు హీరోయిన్లను సెట్ చేయడం కష్టమవుతున్న రోజుల్లో చిరుతో నయన్‌కు బాగానే జోడీ కుదిరింది. 'సైరా నరసింహా రెడ్డి'లో చిరు భార్య పాత్రలో కనిపించింది నయన్. ఐతే 'గాడ్ ఫాదర్'లో మాత్రం ఇద్దరినీ జోడీగా చూపించలేదు. చిరుకు నయన్‌ను చెల్లెలిగా చూపించి పెద్ద షాకిచ్చారు. ఐతే ఆ సినిమా పెద్దగా జనాల దృష్టిలో లేదు కాబట్టి.. ఈసారి చిరు పక్కన నయన్‌ను జోడీగానే తీసుకున్నాడు అనిల్ రావిపూడి. 'మన శంకర వర ప్రసాద్ గారు'లో చిరు, నయన్ మధ్య బాగానే కెమిస్ట్రీ పండబోతోందని 'మీసాల పిల్ల' పాట ప్రోమోలు చూస్తే అర్థమైపోయింది. ఈ పాట సినిమాలో చిరు, నయన్ పాత్రల గురించి.. కథ గురించి కొంత హింట్ కూడా ఇవ్వడం విశేషం. 'మన శంకర వరప్రసాద్ గారు' చిరుకు నయన్ మాజీ భార్య పాత్రలో కనిపించనుండడం విశేషం. 'మీసాల పిల్ల' పాట లిరిక్స్ గమనిస్తే ఆ విషయం తెలుస్తుంది. ఈ పాటలో 'నీ తప్పులు ఒకటా రెండా చిత్రగుప్తుడి చిట్టాలా.. నీ వేషాలు చాల్లే.. నువ్వు కాకా పడితే కరిగేటంత సీనే లేదులే' అని నయన్ అంటే.. 'రాజీ పడదామంటే రావే మాజీ ఇల్లాలా' అని చిరు అంటాడు. మరి దీని చుట్టూ అనిల్ ఎలాంటి డ్రామా.. కామెడీ నడిపాడో.. ప్రేక్షకులను ఎలా మెప్పిస్తాడో చూడాలి.



## హొంబలే, మైత్రి పోటా పోటీ

సౌత్ నిర్మాణ సంస్థలు హొంబలే, మైత్రి రెండు పోటా పోటీగా సినిమాలు చేస్తున్నాయి. ముఖ్యంగా పాన్ ఇండియా సినిమాలు ఓ పక్క ప్రాంతీయ సినిమాలు మరో పక్క అన్నట్టుగా ఈ రెండు ప్రొడక్షన్ హౌస్ ల ప్లానింగ్ అదిరిపోతుంది. కన్నడ ప్రొడక్షన్ కంపెనీ హొంబలే ప్రొడక్షన్స్ వాళ్లు కె.జి.ఎఫ్ తో సెన్సేషన్ క్రియేట్ చేశారు. ఆ సినిమా తర్వాత నుంచి క్రేజీ కాంబినేషన్స్ సెట్ చేస్తూ సత్తా చాటుతున్నారు. ఈమధ్యనే యానిమేషన్ సినిమాతో కూడా బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. హొంబలే ప్రొడక్షన్స్ కన్నడలోనే కాదు తెలుగు, తమిళ భాషల్లో కూడా క్రేజీ కాంబినేషన్స్ సెట్ చేసే ప్లానింగ్ లో ఉన్నారు. తెలుగు నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ కూడా అదే రేంజ్ ప్లానింగ్ తో వస్తుంది. ఆల్రెడీ తెలుగులో పాన్ ఇండియా సినిమాలు ఒక దానికి మించి మరొకటి అనే రేంజ్ లో ఉండగా అది చాలదు అన్నట్టుగా తమిళ్, హిందీలో కూడా సినిమాలు చేస్తున్నారు. తమిళ్ లో తల అజిత్ తో గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమా చేసి సక్సెస్ అందుకున్నారు మైత్రి నిర్మాతలు. ఆధిక్ రవిచంద్రన్ డైరెక్షన్ లో తెరకెక్కిన గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమా అజిత్ ఫ్యాన్స్ కి ఒక ఫీస్ట్ అందించింది. ఇక హిందీలో సన్నీ డియోల్ తో 'చేసిన జాత్ సినిమా సూపర్ సక్సెస్ అయ్యింది. తెలుగు నిర్మాణ సంస్థ పర్ఫెక్ట్ ప్లానింగ్ తో జాత్ సినిమాను తీసి హిందీలో కూడా సక్సెస్ అందుకున్నారు. సన్నీ మార్కెట్ ని మైత్రి మేకర్స్ వేసిన అంచనాకి బాలీవుడ్ బడా నిర్మాణ సంస్థలు కూడా షాక్ అయ్యేలా చేసింది. మైత్రి మేకర్స్ ఇలానే పాన్ ఇండియా సినిమాలతో పాటు సెపరేట్ గా సినిమాలు ప్లాన్ చేస్తున్నారు. హొంబలే ప్రొడక్షన్ నెక్స్ట్ తెలుగు హీరోల టార్గెట్ తో సినిమాలు ఫిక్స్ చేస్తుంది. ఆల్రెడీ ప్రభాస్ తో వాళ్ల 3 సినిమాల డీల్ కుదిరింది. నెక్స్ట్ టాలీవుడ్ పాన్ ఇండియా స్టార్ తో ప్లానింగ్ ఉందట. సో తెలుగులోనే కాదు అటు పాన్ ఇండియా లెవెల్ లో కూడా హొంబలే ప్రొడక్షన్ కి మైత్రి మూవీ మేకర్స్ గట్టి ఫైట్ ఇస్తుందని చెప్పొచ్చు. ఐతే ఎవరి ప్లానింగ్ వారిది.. ఎవరి సినిమాలు వారివి కాబట్టి ప్రతి సినిమా ఒక రేంజ్ లో ఇంపాక్ట్ చూపించబోతున్నాయని చెప్పొచ్చు.



## పార్టులు పార్టులు వద్దు
### బుచ్చిబాబుకు చరణ్ షరతు

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ పెద్దితో పెద్ద టార్గెట్ నే పెట్టుకున్నాడు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ సినిమాలో చరణ్ కి జతగా జాన్వీ కపూర్ నటిస్తుంది. దేవరతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన ఈ అమ్మడు పెద్దితో మరోసారి తన లక్ టెస్ట్ చేసుకోవాలని చూస్తుంది. దేవర ఎన్టీఆర్ ఫ్యాన్స్ ని సాటిస్ఫై చేసినా కూడా జాన్వి కపూర్ పోర్షన్ మాత్రం ఆమెకు ఏమాత్రం యూజ్ అవ్వలేదు. అందుకే అమ్మడు పెద్ది మీద చాలా హోప్స్ తో ఉంది. ఐతే పెద్ది సినిమా విషయంలో బుచ్చి బాబుకి చరణ్ కొన్ని రూల్స్ ని పెట్టాడట. సినిమా అనుకున్న విధంగా చేసేలా కంఫర్ట్ జోన్ సిద్ధం చేసిన చరణ్.. సినిమా బాగా వస్తుందని మధ్యలో ఆపేసి రెండో పార్ట్ కూడా చేద్దామని ప్లానింగ్ వద్దని అన్నాడట. బుచ్చి బాబుకి ఫ్రీ హ్యాండ్ ఇచ్చిన చరణ్ సినిమాను ఎట్టి పరిస్థితుల్లో ఒక సినిమాగానే ముగించాలని చెప్పాడట. ఈమధ్య పాన్ ఇండియా సినిమాల్లో రెండు భాగాలు అన్నది ప్యాషన్ అయ్యింది. ఐతే అందులో కొన్ని పార్ట్ 2 కావాల్సిందే అనిపించేలా ఉండగా మరికొన్ని మాత్రం అసలు ఈ సినిమా రెండు భాగాలు అవసరమా అన్నట్టు ఉంటున్నాయి. అందుకే అలాంటి రిస్క్ తీసుకోకుండా పెద్ది సినిమాను పార్ట్ 1 అండ్ 2 అనేలా కాకుండా ఒకే సినిమాగా తెరకెక్కించాలని చెప్పాడట.



# కేన్‌మామ కొత్త ఇన్నింగ్స్

ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌కు ముందు లక్నో సూపర్ జెయింట్స్ కోచింగ్ బృందాన్ని పటిష్టం చేసుకుంటోంది. ఈమధ్యే మాజీ పేసర్ భరత్ అరుణ్‌ను బౌలింగ్ కోచ్‌గా నియమించుకున్న లక్నో.. మరో కీలక నిర్ణయాన్ని ప్రకటించింది. ఈసారి ఎలాగైనా కప్పు కొట్టి తీరాలనే కసితో ఉన్న సంజీవ్ గొయెంకా ఫ్రాంచైజీ న్యూజిలాండ్ క్రికెటర్ కేన్ విలియమ్సన్‌ను సలహాదారుగా తీసుకుంది. సుదీర్ఘ అనుభవం కలిగిన ఈ కివీస్ మాజీ సారథితో వ్యూహాత్మక సలహాదారుగా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఏడాది ఎస్ఏ20లో దర్బన్ సూపర్ జెయింట్స్‌కు విలియమ్సన్ ప్రాతినిధ్యం వహించాడు. దాంతో.. అతడి సేవల్ని ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో 19వ సీజన్ కోసం కీలక బాధ్యతలను అప్పగించింది. ఈ విషయాన్ని లక్నో తమ అధికారిక ఎక్స్ ఖాతాలో వెల్లడించింది. కూల్, కామ్, కాలిక్యులేటెడ్ కేన్ విలియమ్సన్ మా థింక్ ట్యాంక్‌లో స్ట్రాటజిక్ వ్యూహకర్తగా భాగం కానున్నాడు.

# కోహ్లి, రోహిత్‌కు సవాలే: షేన్ వాట్సన్

ప్రస్తుతం క్రికెట్ అభిమానుల కళ్లన్నీ ఆస్ట్రేలియా, భారత్ మధ్య జరగనున్న వన్డే సిరీస్‌పైనే ఉన్నాయి. అక్టోబర్ 19 నుంచి మొదలుకానున్న ఈ సిరీస్‌లో భారత స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి ఆడబోతున్నారు. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత వీరిద్దరు భారత్ తరఫున బరిలోకి దిగడం ఇదే తొలిసారి. టీ20లు, టెస్టులకు వీడ్కోలు పలికిన ఈ ద్వయం ఆస్ట్రేలియా టూర్‌లో రాణిస్తేనే తర్వాత జరిగే వన్డే మ్యాచ్‌లకు ఎంపిక చేసే అవకాశముంది. దీంతో ఈ సిరీస్ రో-కోకు కీలకంగా మారింది. అయితే, చాలా రోజుల తర్వాత



అంతర్జాతీయ క్రికెట్ ఆడనున్న రోహిత్, కోహ్లి అత్యంత కఠినమైన సవాలును ఎదుర్కొనబోతున్నారని ఆసీస్ మాజీ ఆల్‌రౌండర్ షేన్ వాట్సన్ పేర్కొన్నాడు. 'సుదీర్ఘ విరామం తర్వాత మైదానంలోకి అడుగుపెట్టడం అంత సులభం కాదు. ముఖ్యంగా ప్రపంచ క్రికెట్‌లో అత్యుత్తమ బౌలర్లు ఉన్న ఆస్ట్రేలియా వంటి జట్టును ఎదుర్కోవడం సవాలుతో కూడుకున్నది. కోహ్లి, రోహిత్ లయను అందుకోవడానికి కొంత సమయం పట్టొచ్చు. కానీ, వారు నాణ్యమైన క్రికెటర్లు. తొందరగానే రిథమ్ అందుకుంటారని భావిస్తున్నా. రోహిత్, విరాట్‌కు ఇదే లాస్ట్ టూర్ కావచ్చు. ఆస్ట్రేలియా ప్రజలు వారిద్దరిని ఉత్సాహపరిచి తమ అభిమానాన్ని చాటుతారని అనుకుంటున్నా. చాలా ఏళ్లుగా ఆస్ట్రేలియాకు గట్టిపోటీ ఇచ్చే వాళ్లలో కోహ్లి ఒకడు. మాతో ఆడినప్పుడల్లా మంచి ప్రదర్శన చేస్తాడు. అతనిలో పోటీతత్వం ఎక్కువ. రోహిత్ కూడా అద్భుతమైన ప్లేయర్, కెప్టెన్. బాగా ఆడిన ప్రతిఒక్కరిని ఆస్ట్రేలియా ప్రజలు అభినందిస్తారు. అందుకు కోహ్లి, రోహిత్ ఉదాహరణగా నిలుస్తారు' అని వాట్సన్ వివరించాడు.



# నెట్స్‌లో కోహ్లి, రోహిత్

భారత దిగ్గజాలు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలు ఆస్ట్రేలియా పర్యటనలో దంచేసేందుకు సిద్ధమవుతున్నారు. స్క్వాడ్‌తో కలిసి కంగారూ దేశం చేరుకున్న ఈ స్టార్ ఆటగాళ్లు గురువారం నెట్స్‌లో సాధన చేశారు. పెర్త్‌లో ఆదివారం తొలి వన్డే కోసంవిరాట్, హిట్‌మ్యాన్ పెద్ద షాట్లు ఆడుతూ చెమటోడ్చారు. వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్న ఇరువురు.. మునపటి తరహాలో ఆసీస్‌పై చెలరేగిపోవాలనే కసితో ఉన్నారు. ఐపీఎల్ పద్దెనిమిదో సీజన్ తర్వాత రోకో టీమిండియా జెర్సీతో ఆడతున్న తొలి సిరీస్ ఇది. దాంతో, అంచనాలకు మించి రాణించి.. అభిమానులను అలరించేందుకు రెఢీ అవుతున్నారీ టాప్ గన్స్. సుదీర్ఘ కాలం భారత జట్టుకు ఆటగాడిగా, నాయకుడిగా రోహిత్, విరాట్ విశేష సేవలందించారు. అయితే.. యువతరానికి అవకాశమిస్తూ ఒకరితర్వాత ఒకరు టీ20లు, టెస్టులకు వీడ్కోలు పలికారు. ప్రస్తుతం వీరు కొనసాగుతున్న ఫార్మాట్ వన్డే మాత్రమే. వచ్చే వన్డే వరల్డ్ కప్‌లో ఆడాలనుకుంటున్న ఈ వెటరన్ బ్యాటర్లకు.. ఆస్ట్రేలియా సిరీస్ ఎంతో కీలకం కానుంది. మూడు వన్డేల్లో పెద్ద ఇన్నింగ్స్‌లు ఆడింతే.. మరో సిరీస్‌కు ఎంపికయ్యే అవకాశాలున్నాయి. దాంతో, అనుభవజ్ఞులైన ఈ ఇద్దరూ తమ సత్తా చాటితే టీమిండియాకు తిరుగుండదని విశ్లేషకులు అంటున్నారు. ఆస్ట్రేలియాపై రోహిత్, కోహ్లికు మెరుగైన రికార్డుంది. రోహిత్ 19 మ్యాచుల్లో.. 990 రన్స్ సాధించగా.. రన్ మెషీన్ విరాట్ 18 మ్యాచుల్లో 802 పరుగులు బాదాడు.



# దక్షిణాఫ్రికాకు షాక్

**వరుస గెలుపులకు బ్రేక్.. తొలి టెస్టులో పాక్ విజయం**

వరుసగా పది టెస్టుల్లో విజయాలతో జోరుమీదున్న దక్షిణాఫ్రికాకు పాకిస్థాన్ చెక్ పెట్టింది. సొంతగడ్డపై రెండు టెస్టుల సిరీస్ తొలి మ్యాచ్‌లో పాక్ 93 పరుగుల తేడాతో విజయం సాధించింది. రసవత్తరంగా సాగిన తొలి టెస్టులో 277 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా.. షహీన్ అఫ్రిది (4/33), నోమన్ అలీ (4/79), సాజిద్ ఖాన్ (2/38)ల ధాటికి 183 పరుగులకే ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 51/2తో నాలుగో రోజు, బుధవారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన సఫారీ జట్టుకు ఆరంభంలోనే గట్టి ఎదురు దెబ్బలు తగిలాయి. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో టోనీ డి జోర్జి (16) ముందు రోజు స్కోరుకు ఒక్క పరుగూ జోడించకుండానే షహీన్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. ట్రిస్టన్ స్టబ్స్ (2) ఇలా వచ్చి అలా వెళ్లిపోవడంతో దక్షిణాఫ్రికా 55/4తో నిలిచింది. ఈ దశలో రికిల్‌టన్ (45)తో కలిసి డెవాల్డ్ బ్రెవిస్ (54) పోరాడాడు. 128/4తో సఫారీ జట్టు పోటీలోకి వచ్చింది. కానీ బ్రెవిస్‌ను నోమన్, రికిల్‌టన్‌ను సాజిద్ స్వల్ప వ్యవధిలో ఔట్ చేయడంతో సఫారీ జట్టుకు దారులు మూసుకుపోయాయి. అయిదో వికెట్ పడ్డాక ఇంకో 19 ఓవర్లకే ఆ జట్టు ఇన్నింగ్స్ ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో పాక్ 378 పరుగులు చేయగా.. దక్షిణాఫ్రికా 269కి ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్‌లో పాక్ 167 పరుగులకే కుప్పకూలింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 10 వికెట్లు తీసిన నోమన్ అలీ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా ఎంపికయ్యాడు. సిరీస్‌లో చివరిదైన రెండో టెస్టు సోమవారం మొదలవుతుంది.



# పోరాటం ఆపితే ఓడినట్లే: కోహ్లి

ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు ముందు భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి ఆసక్తికర పోస్టు పెట్టారు. 'పోరాటం ఆపాలని ఎప్పుడైతే నిర్ణయించుకుంటామో.. అప్పుడే మనం ఓడిపోయినట్లు' అంటూ పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్ అవుతోంది. ఇప్పటికే టెస్టులు, టీ20ల నుండి రిటైర్ అయిన ఈ స్టార్ 2027 వన్డే ప్రపంచకప్ వరకూ కొనసాగుతారా..? లేక మధ్యలోనే రిటైర్ అవుతారా..? అన్న చర్చ నడుస్తోంది. అక్టోబర్ 19న పెర్త్‌లో ఆస్ట్రేలియాతో జరిగే తొలి వన్డే మ్యాచ్‌లో కోహ్లి ఆడే అవకాశం ఉంది. ఈ మ్యాచ్‌కు ముందు కోహ్లి పోస్టు పెట్టడం ఆసక్తికరంగా మారింది. ఇదిలా ఉండగా.. భారత్-ఆస్ట్రేలియా మధ్య వన్డే సిరీస్‌లో తొలి మ్యాచ్ అక్టోబర్ 19న పెర్త్‌లో జరుగనున్నది. భారత జట్టు ఈ నెల 15న రెండు బ్యాచ్‌లుగా ఆస్ట్రేలియాకు బయలుదేరి వెళ్తుంది. బీసీసీఐ వర్గాలు తెలిపిన వివరాల ప్రాకరం.. మొదటి బృందంలో ఆటగాళ్లు ఉదయం విమానంలో బయలుదేరి వెళ్తారు. రెండో బృందం సాయంత్రం వెళ్తుంది. బిజినెస్ క్లాస్ టిక్కెట్ల లభ్యత, ప్రయాణ ఏర్పాట్లపై ఆధారపడి ఉంటుందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. చాలా రోజుల తర్వాత కోహ్లి భారత జట్టు తరఫున మైదానంలోకి బరిలోకి దిగుతుండడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల 'వెల్‌కమ్ బ్యాక్ కింగ్' అంటూ హ్యాష్‌ట్యాగ్ సోషల్ మీడియాలో ట్రెండ్ అయ్యింది.




# అహ్మదాబాద్‌లో 2030 కామన్‌వెల్త్ క్రీడలు

గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా 2030 కామన్‌వెల్త్ క్రీడలు జరగనున్నాయి. విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఇవాళ ఈ విషయాన్ని వెల్లడించారు. ఆయన తన ఎక్స్ అకౌంట్ వేదికగా ఈ అంశాన్ని ప్రకటించారు. 2030లో జరిగే కామన్‌వెల్త్ క్రీడలకు భారత్ ఆతిథ్యం ఇవ్వనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఇది భారత దేశానికి, గుజరాత్‌కు గర్వకారణమన్నారు. ప్రపంచ స్థాయి మౌళిక సదుపాయాల కల్పనకు, క్రీడా టాలెంట్‌ను వెలికి తీసేందుకు ప్రధాని మోదీ విజన్ నిదర్శనంగా పనిచేస్తుందన్నారు. అయితే 2036లో ఒలింపిక్స్ క్రీడలు నిర్వహించాలనుకుంటున్న భారత్‌కు.. కామన్‌వెల్త్ క్రీడల నిర్వహణ ఓ ప్లాట్‌ఫామ్‌గా నిలిచే అవకాశం ఉన్నది. నవంబర్ 26వ తేదీన స్కాట్‌లాండ్‌లోని గ్లాస్‌గోవ్‌లో జరగనున్న జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో అహ్మదాబాద్ అంశాన్ని పరిశీలించనున్నారు.

# విదేశీ లీగ్‌ల్లో భారత ఆటగాళ్లు ఆడాలి: రవిశాస్త్రి

విదేశీ లీగ్‌లలో ఎక్కువ మంది భారత ఆటగాళ్లు పాల్గొనడానికి అనుమతించాలని టీమ్‌ఇండియా మాజీ కోచ్ రవిశాస్త్రి సూచించాడు. విదేశాలలో అంతర్జాతీయ స్టార్ క్రికెటర్లతో కలిసి ఆడటం వల్ల యువ ఆటగాళ్లు ఎన్నో విషయాలు నేర్చుకుంటారని



తెలిపాడు. ప్రస్తుతం క్రికెట్ ఆడుతున్న, రిటైర్మెంట్ ప్రకటించని భారత ఆటగాళ్లు విదేశీ టీ20 లీగ్‌లలో పాల్గొనకుండా బీసీసీఐ నిషేధం విధించింది. దేశవాళీ, అంతర్జాతీయ క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించి బోర్డు నుంచి నిరభ్యంతర పత్రం పొందిన వారికి మాత్రమే విదేశీ లీగ్‌ల్లో ఆడేందుకు అనుమతిస్తోంది. మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ బిగ్‌బాష్ లీగ్‌లో ఆడేందుకు ఇటీవల గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. డిసెంబర్‌లో ప్రారంభంకానున్న బిగ్‌బాష్ లీగ్‌లో అశ్విన్ సిడ్నీ థండర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఆ లీగ్‌లో పాల్గొననున్న మొదటి హై ప్రొఫైల్ భారత క్రికెటర్ అశ్వినే కావడం విశేషం. ఈ నేపథ్యంలో ప్రస్తుతమున్న నిబంధనను తొలగించాలని బీసీసీఐకి రవిశాస్త్రి సూచించాడు. 'భారత్ చాలా పెద్ద దేశం.

# రికార్డు ముంగిట రోహిత్ శర్మ

ఆస్ట్రేలియాతో వైట్ బాల్ సిరీస్‌లో తలపడేందుకు టీమ్‌ఇండియా సిద్ధమవుతోంది. కంగారులతో అక్టోబర్ 19 నుంచి మూడు వన్డే సిరీస్‌లు, ఇదేనెల 29 నుంచి ఐదు టీ20లు ఆడనుంది. ఇప్పటికే వన్డే జట్టు ఆస్ట్రేలియాకు చేరుకుంది. పెర్త్‌లో తొలి వన్డే జరగనుంది. ఈ మ్యాచ్‌లో భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ అరుదైన ఘనత అందుకోనున్నాడు. హిట్‌మ్యాన్‌కు అంతర్జాతీయ కెరీర్‌లో ఇది 500వ మ్యాచ్. ఇప్పటివరకు భారత్ తరఫున నలుగురు మాత్రమే ఈ ఫీట్ సాధించారు. సచిన్ తెందూల్కర్ (664), విరాట్ కోహ్లి (550, ఎంఎస్ ధోనీ (535), రాహుల్ ద్రవిడ్ (504) ఐదు వందలకు పైగా మ్యాచ్‌లు ఆడారు. తాజాగా ఈ జాబితాలో రోహిత్ చేరబోతున్నాడు. ఇప్పటివరకు ఇతను 67 టెస్టులు, 273 వన్డేలు, 159 టీ20లు ఆడాడు.



ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
శుక్రవారం 17-10-2025 | www.evarthalu.com

పొడి మట్టిలో మెరిసే మెరుపులా,
పేదల చుట్టూ పొర్కలు, పశువులా!
భూమి కొట్టుకుని కేకలు అరుస్తుంది,
అధికారుల కళ్ళలో కనిపించని గుండెలు!
అయ్యో! ఆకలి రాక్షసి మింగుతుంది మనల్ని,
పిల్లల చిరునవ్వులు పొడి అయ్యాయి రచ్చ!
గ్రామాలు గర్జిస్తున్నాయి, ఊర్లు ఊపిరి తీస్తున్నాయి,
పేదరికం ఈ పాతలో, పూర్తిగా పగిలిపోవాలి!
ఎద్దుపో! రైతా, కార్మికా, మహిళా శక్తి!
కులాలు, మతాలు మరచి, ఒక్కటై పోరాడు!
కర్రలు చేతిలో, కవితలు మొజుకులో,
విప్లవ రాగము రగిలించు, భూమి మీద!
అణచివేతలు అధికారుల చేతిలో లేవు,
మన చేతుల్లోనే మార్పు, మన గుండెల్లోనే రక్తం!
పేదరికం పడగాని పాము, మా కత్తితో కట్ చేయి,
సమానత్వ రంగులలో, కొత్త ప్రపంచం కట్టుకో!
గెలిచిన గీతము పాడాలి మనమంతా,
పేదరిక నిర్మూలన విప్లవం, రగిలే రాగము!
అగ్ని జ్వాలలా ఎదుగుదు, ఆకాశానికి చేరుదు,
భారతదేశం మొత్తం, సంతోష సముద్రమై పెరుగుదు!



# ఆకలి పోరాటం.. ఆగని పేదరికం



ఒకవైపు అంతరిక్ష పర్యటనలు.. మరోవైపు ఆకలి చావులుబీ ఒకవైపు అద్దాల మేడలు.. మరోవైపు పేదల గుడిసెలు. రెండుగా విభజించిన కాలమిది. ఆగని ఆకలి చావుల ప్రపంచమిది. ప్రపంచవ్యాప్తంగా పేదలు పేదలుగానే, ధనవంతులు.. మరింత ధనవంతులుగా మారుతున్నారు. ప్రపంచ దేశాల్లో ఇంకా ఇప్పటికీ పేదరికంలో మగ్గిపోతున్న వాళ్లు ఎందెందరో అభాగ్యులు ఉన్నారు. ఎన్నో పోరాటాలు చేసే కావలిసినవి సాధించుకున్నాం గానీ.. ఇప్పటికీ పేదవాడు ఎ□ప్పుడు ఆకలి పోరాటం చేస్తునే ఉన్నాడు. ప్రభుత్వాధి నేతలు, దేశాధి నేతలు ఎన్ని పథకాలను తీసుకువచ్చినా పేదవాడికి చేరకపోవడమే మింగుడుపడని విషయంగా మిగిలిపోతోంది. ఈ క్రమంలో ఐక్యరాజ్యసమితి పేదరిక నిర్మూలనకు తీసుకోవల్సిన చర్యలపై ప్రపంచ దేశాలకు అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతోనే ప్రతి ఏడాది అక్టోబర్ 17న అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం నిర్వహిస్తోంది. ఫ్రెంచ్ మతాధికారి, మానవతవాది అయిన జోసెఫ్ వ్రెసిన్స్కీ పేదరికంతో బాధితులను పట్ల వివక్షకు తావు లేకుండా వారిని గౌరవప్రదంగా చూడాలంటూ ఎన్నో పోరాటాలు చేశారు. అంతేకాదు పారిస్‌లోని ట్రోకాడోరోలో లక్షలాది మంది తన మద్దతుదారులతో కలిసి పేదరికంలో మగ్గిపోతున్న వాళ్ల సమస్యల దేశాధినేతలకు అర్థమయ్యేలా ఒక ఉద్యమాన్ని తీసుకురావడమే కాక అక్టోబర్ 17, 1987న పారిస్ ప్లాజా ఆఫ్ లిబర్టీ మానవ హక్కుల స్మారక శిలను ఆవిష్కరించారు. పైగా ఆ శిలపై మహిళలు, పురుషులు పేదరికంలో ఉన్నారంటే మానవ హక్కుల ఉల్లంఘనగా పరిగణించాలి అనే వాక్యాలను చెక్కించారు. 1988లో జోసెఫ్ మరణాంతరం నాలుగు సంవత్సరాల తర్వాత 1992 డిసెంబర్ 22 ఐక్యరాజ్యసమితి పేదరిక నిర్మూలన కోసం ప్రపంచదేశాలన్ని ఏకతాటిపై కృషి చేయాలంటూ ఒక తీర్మానాన్ని తీసుకురావడమే కాక ఆమోదించింది. ఈ మేరకు ఐక్యరాజ్యసమితి పేదల కోసం ఆహర్నిశలు కృషి చేసిన జోసెఫ్ వ్రెసిన్స్కీని పేద ప్రజల తండ్రిగా కొనియాడుతూ ఆయన ఆవిష్కరించిన స్మారక శిల రోజునే అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవంగా ప్రకటించింది.

భారతదేశం పేదరిక నిర్మూలనలో అద్భుతమైన ప్రగతి సాధించి, ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది. ఒకప్పుడు దేశానికి పెద్ద సవాలుగా ఉన్న పేదరికం, దశాబ్ద కాలంలో గణనీయంగా తగ్గిపోయినట్లు వరల్డ్ బ్యాంకు విడుదల చేసిన తాజా నివేదిక స్పష్టం చేసింది. 2011-12, 2022-23 మధ్య కాలంలో.. భారతదేశంలో తీవ్ర పేదరికం 27.1 శాతం నుంచి కేవలం 5.3 శాతానికి తగ్గిపోయింది. ఈ 11 ఏళ్ల వ్యవధిలో ఏకంగా 26.9 కోట్ల మంది ప్రజలు తీవ్ర పేదరికం నుంచి బయటపడ్డారు. ప్రపంచ బ్యాంకు పేదరికాన్ని కొలవడానికి కొన్ని నిబంధనలు ఉపయోగిస్తుంది. "వినియోగ స్థాయి" అంటే, ఒక వ్యక్తి రోజుకు తన అవసరాల కోసం ఎంత ఖర్చు చేయగలడు లేదా ఎంత విలువైన వస్తువులను వినియోగించుకోగలడు అని అర్థం. గతంలో ప్రపంచ బ్యాంకు రోజుకు 2.15 డాలర్లు (అమెరికన్ డాలర్లు) ఖర్చు చేయలేని వారిని పేదలుగా పరిగణించేది. అంటే, ఎవరైతే రోజుకు 2.15 డాలర్ల కంటే తక్కువ ఖర్చుతో బతుకుతారో, వారు తీవ్ర పేదరికంలో ఉన్నారని లెక్కించేది. అయితే, ఇప్పుడు ప్రపంచ బ్యాంకు ఈ కొలమానాన్ని మరింత కఠినతరం చేసింది. ఇప్పుడు రోజుకు 3 డాలర్లు ఖర్చు చేయలేని వారిని పేదలుగా లెక్కిస్తుంది. అంటే, పేదరికంలో ఉన్నవారిని గుర్తించడానికి, వారు రోజుకు కనీసం 3 డాలర్లు కూడా ఖర్చు చేయలేకపోతేనే, అప్పుడు వారిని పేదలుగా భావిస్తుంది. దీనికి అదనంగా, 2021 నాటి కొనుగోలు శక్తి సమానతలను కూడా పరిగణనలోకి తీసుకుంది. %ఫ్రా%లు అంటే.. వివిధ దేశాల్లో ఒకే వస్తువును కొనడానికి ఎంత ఖర్చు అవుతుందో పోల్చడం. దీనివల్ల వివిధ దేశాల్లోని నిజమైన కొనుగోలు శక్తిని అర్థం చేసుకోవచ్చు. ఈ కఠినమైన కొలమానాలతో కూడా భారతదేశం లో పేదరికం ఇంత భారీగా తగ్గడం విశేషం. ఇది భారతదేశం ఆర్థిక విధానాలు, సామాజిక పథకాలు నిజంగా విజయవంతమయ్యాయని రుజువు చేస్తుంది.

భారతదేశంలో తీవ్ర పేదరిక నిర్మూలనలో 5 రాష్ట్రాలు కీలక పాత్ర పోషించాయి. 2011-12లో భారతదేశంలోని మొత్తం తీవ్ర పేదరికంలో ఉన్న వారిలో.. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోనే 65 శాతం మంది నివసించేవారు. అయితే, 2022-23 నాటికి, మొత్తం తీవ్ర పేదరిక తగ్గింపులో మూడింట రెండు వంతులు ఈ 5 రాష్ట్రాలపైనే ఉంది. ఇది ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసిన పేదరిక వ్యతిరేక కార్యక్రమాల విజయానికి నిదర్శనం. ప్రపంచ బ్యాంకు ఈ సవరణల తరువాత, 2022కి ప్రపంచ తీవ్ర పేదరిక రేటు 9 శాతం నుంచి 10.5 శాతానికి సర్దుబాటు చేసింది. ఫలితంగా, అంతర్జాతీయ దారిద్ర్య రేఖ కింద జీవిస్తున్న ప్రజల సంఖ్య 713 మిలియన్ల నుంచి 838 మిలియన్లకు పెరిగింది. అయితే, భారతదేశం సాధించిన ఈ ప్రగతి, ప్రపంచ పేదరిక నిర్మూలన ప్రయత్నాలకు మంచి ఊతం ఇస్తుంది. ఒకప్పుడు ప్రపంచంలోని అత్యధిక పేదలు ఉన్న దేశాల్లో ఒకటిగా ఉన్న భారత్.. ఇప్పుడు వారిని గణనీయంగా తగ్గించి, ప్రపంచ పేదరిక గణాంకాలను ప్రభావితం చేయగల స్థాయికి చేరుకుంది.

### భారతదేశంలో పేదరికం స్థాయి (2022-23):

**తీవ్ర పేదరికం: 2.3%**
**గ్రామీణ పేదరికం: 2.8%**
**పట్టణ పేదరికం: 1.1%**

### పేదరికానికి ప్రధాన కారణాలు:

- **నిరుద్యోగం:** ముఖ్యంగా వ్యవసాయ రంగంలో ఉపాధి అవకాశాలు తక్కువగా ఉండటం.
- ఆర్థిక అసమానతలు: ఆర్థిక వృద్ధి ప్రయోజనాలు సమానంగా అందకపోవడం.
- **జనాభా పెరుగుదల:** ఇది కూడా పేదరికానికి ఒక కారణం.
- **తక్కువ ఆర్థికాభివృద్ధి రేటు:** దేశం మొత్తం ఆర్థికంగా అభివృద్ధి చెందకపోవడం ఒక కారణం.

### ముఖ్య మైలురాళ్లు, అభివృద్ధి

- 1995: వరల్డ్ సమిట్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్ (కోపెన్‌హేగన్ సమ్మిట్): పేదరిక నిర్మూలన, ఉపాధి సృష్టి, సామాజిక సమైక్యతను మూల సమస్యలుగా గుర్తించింది. ఇది అంతర్జాతీయ సహకారాన్ని పెంచడానికి మార్గదర్శకంగా నిలిచింది.
- 1997: మొదటి ఐక్యరాజ్య సమితి దశాబ్ది (1997%-%2006): పేదరిక నిర్మూలనకు అంతర్జాతీయ చట్రాలు రూపొందించడానికి ప్రారంభమైంది.
- 2008%-%2017: రెండవ దశాబ్ది: మిలీనియం డెవలప్‌మెంట్ గోల్స్‌లో పేదరిక నిర్మూలనపై దృష్టి పెట్టింది. 1990లో 1.867 బిలియన్ల మంది తీవ్ర పేదరికంలో ఉండగా, 2013కి 783 మిలియన్లకు తగ్గింది.
- 2015: సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్: ప్రతివర్ధి పేదరిక నిర్మూలన ద్వారా 2030 నాటికి తీవ్ర పేదరికాన్ని మూలం దగ్గర నుండి తొలగించాలని లక్ష్యం.
- 2018%-%2027: మూడవ దశాబ్ది: ప్రస్తుత దశాబ్ది, పేదరిక నిర్మూలనకు మొమెంటమ్‌ను కొనసాగించడానికి, ఎస్‌డీజీలకు మద్దతు ఇవ్వడానికి రూపొందించబడింది.

# ఐదు రోజుల పండుగ.. దీపావళి



**దీపావళి (దీపోత్సవం) హిందూ సంస్కృతిలో అత్యంత ప్రసిద్ధమైన పండుగలలో ఒకటి. ఇది కేవలం ఒక పండుగ కాదు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సామాజిక విలువల సమ్మేళనం. ఈ దీపావళిని ఐదు రోజుల పాటు జరుపుకుంటారు. అవి ధన్వంతరీ త్రయోదశి, నరక చతుర్దశి, చతుర్దశి, బలి పాడ్యమి, యమద్వితీయ.**



రామ్ మనోహర్ శర్మ
ఆధ్యాత్మిక పండితుడు

ధన్వంతరీ త్రయోదశి: వాడుకలో ధన త్రయోదశి అని అంటూ ఆ రోజు బంగారం కొనాలనే ఆశ పడుతున్నా! కానీ ఆరోజు 'ఆయుర్వేదానికి, ఆరోగ్యానికి మూల పురుషుడు శ్రీమన్నారాయణ స్వరూపుడు అయిన 'ధన్వంతరీ భగవాన్' జయంతి. పాల సముద్రం చిలికిన సమయంలో చేతిలో అమృత భాండముతో అవతరించాడు.

నరక చతుర్దశి: నరక యాతనల నుండి రక్షించమని యముడి ప్రీతి కొరకు మరియు పితృదేవతల ప్రీతి కొరకు ముందు దక్షిణ దిశలో దీపాన్ని వెలిగించి మిగతా అన్ని దీపాలను వెలిగించాలి. నరకుడు చనిపోయిన రోజు కూడా ఇదే రోజు (ప్రాగ్జ్యోతిషపురం (నేటి అస్సాం) ను పాలించే 'నరకుడు' నర రూప రాక్షసుడు దేవీ ఉపాసకుడు అని దేవిని వామాచారంలో క్షుద్రపూజలు చేసి అనేక అద్భుతశక్తులను సంపాదించి దేవతలను కూడా ఓడించాడు. వాడు (ప్రతీ అమావాస్య- పౌర్ణమికి నవ యవ్వన రావ కన్యలను దేవికి బలి ఇచ్చే వాడు, కాముకత్వంతో అనుభవించేవాడు. నరకుని



చెరసాలలో వేలాది అందమైన మహిళలు ( రాచకన్యలు) బందీలుగా వుండేవారు. ఆది వరాహమూర్తికి - భూదేవికి కలిగిన సంతానమే ఈ నరకుడు తామస ప్రవృత్తితో జనించాడు. (శ్రీకృష్ణ భగవానుడు -సత్యభామ ( భూదేవీ అవతారం ) తో కలసి గరుడారూఢుడై వచ్చి శక్తి ఉపాసకుడైన నరకుని శక్తి (సత్యభామ ) సహకారంతో సంహరించాడు. నరకుని పీడ విరగడైంది కావున ఇది నరక చతుర్దశి.

చతుర్దశి: రావణ సంహారం తర్వాత సీతారాములు అయోధ్యకు వచ్చిన శుభ సందర్భంగా దీపావళి జరుపు కోవటం, నరకుని బాధల నుండి విముక్తి లభించిన ఆనందంలో దీపావళిని జరుపుకోవటం అనాదిగా వస్తున్న ఆచారం. దీపం - లక్ష్మీ స్వరూపం - ఐశ్వర్య స్వరూపం - జ్ఞాన స్వరూపం అందుకే మనం దీపావళీ రోజు లక్ష్మీపూజలు చేస్తాము. వ్యాపారస్తులు కొత్త లెక్కలు రాసుకుంటారు.

బలిపాడ్యమి: వామనావతారంలో శ్రీమన్నారాయణుడు బలి చక్రవర్తిని మూడు అడుగులనేలను దానమడిగాడు. వామన వటువుకు దానమిచ్చాడు బలి, ఇంతింతైవటుడింతైనభోరాశిపైనల్లంతై' అన్నట్లుగా ఒక పాదంతో భూమిని, ఇంకో పాదంతో ఆకాశాన్ని ఆక్రమించిన 'త్రివిక్రముడు' వేరొక పాదంతో బలిని పాతాళానికి అణచాడు. సంవత్సరానికి ఒకసారి బలి పాడ్యమి రోజున బలి భూలోకానికి వచ్చి ఇక్కడి దీపకాంతులను చూసి మనమంతా సుఖశాంతులతో వుండాలని ఆశీర్వదించి వెలతాడు ఇదే ఆయనకు వామనుడిచ్చిన వరం.

యమద్వితీయ: సూర్య భగవానునికి యముడు - శనిదేవుడు ఇద్దరు పుత్రులు. యమున అనే ఒక పుత్రిక కలదు. యముడు - యమున ఇద్దరూ అన్నా చెల్లెలు కదా ! తనవని (జీవులను ఆయువు మూడిన తర్వాత తన యమపాశంతో ఈడ్చుక వచ్చి వారి వారి కర్మాను సారం వారి వారికి తగిన శిక్షలు విధించే పనిలో పడి పాపం చెల్లెలింటికి వెళ్ళటం లేదు యముడు. చెల్లి బతిమాలింది ఒకసారి మా ఇంటికి రా అన్నయ్యా అని బతిమాలింది చెల్లెలు కార్తీక శుద్ధ విదియ, మంగళవారం రోజు తీరిక చేసుకుని తన చెల్లెలింటికి వెళ్ళి హాయిగా కొద్ది సేపు వుండి భోజనం చేసి వచ్చాడు యముడు చెల్లెలైన యమున అన్నయ్యను ఒక వరం అడిగింది. ఎవరైతే ఈ రోజు చెల్లెలింటికి వెళ్ళి చెల్లెలి కట్నకానుకలిచ్చి వాళ్లింట్లో భోజనం చేసి వస్తారో వారికి యముని బాధలు లేకుండా చేయు అని అడిగింది. ఈ యమునమ్మనే యమునా నది. కృష్ణుని భక్తురాలు. భగినీ హస్తభోజనం అన్న పేరుతో ఉత్తర భారతంలో ఈ పండుగ ఇప్పటికీ జరుపుకుంటారు.

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.